J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

కాంతి

సంపుటి : 42 సంచిక : 17 30.9.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

పార్టీ నాయకులకు
మరోసారి జగన్ ఝలక్

- మీరు మారండి... లేదంటే మిమ్మల్నే మార్చేస్తా
- సొంత పార్టీ నేతలను హెచ్చరించిన ముఖ్యమంత్రి
- ఇవేం సర్వేలు..? అని వాపోతున్న వైసిపి శ్రేణులు
- తమ నేతను తప్పదోవ పట్టిస్తున్నారంటున్న పార్టీ వర్గాలు

ఇవి ముఖ్యమంత్రి నోటినుండి అప్పుడప్పుడూ వినపడుతున్న మాటలే. మంత్రులైనా, శాసనసభ్యులైనా, పార్లమెంటు సభ్యులైనా, పార్టీ ఇన్‌ఛార్జులైనా తనకెవరైనా ఒక్కటే. 'మీ పని తీరు మార్చుకోకపోతే మార్చేస్తా". తనకు పార్టీ గెలుపు ముఖ్యం. 175కి 175 సీట్లు గెలవాలన్నదే లక్ష్యం. రెండోసారి ముఖ్యమంత్రి సీటులో కూర్చోవడమే ధ్యేయం. ఈ క్రమంలో ఆయనకి ఎవరైనా ఒక్కటే. ఇందులో తన, మన అన్న భేదమే లేదు. మొహమాటానికి చోటే లేదు.

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఇప్పుడిప్పుడే పథకాలు, పలకరింపుల పేరుతో క్రమేణా మళ్ళీ జనారణ్యంలోకి వస్తున్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను గమనించడానికి ఈ పర్యటనలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. సర్వేలపైనా, సలహాదారులపైన ఆధారపడకుండా అసలేం జరుగుతోందో ఆయనే స్వయంగా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు అర్థమైపోతోంది. 'ప్రజలకు మీరు దగ్గర కావాలని' గతంలో అనేకసార్లు తమ పార్టీ నాయకులకు హితబోధ చేసిన ముఖ్యమంత్రి, ఈసారి ఆ మాటనే మళ్ళీ గుర్తుచేస్తూ కాస్తంత గట్టిగానే హెచ్చరిక చేశారు. 175కి 175సీట్లూ గెలవాలని, ఏ ఒక్కటీ మిస్ కాకూడదని, గడప గడపకు వెళ్తేనే గెలుపు సాధ్యమవుతుందని, అనుకున్న లక్ష్యం చేరగలమని ఆయన స్పష్టంగా చెప్పారు.

'మనం జనంలో ఉండాలి. గడప గడపా తిరగాలి. ప్రతి ఒక్కరినీ కలవాలి. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. వారంలో నాలుగు రోజుల పాటు ఇదే పనిలో ఉండాలి'.. అంటూ ముఖ్యమంత్రి జగన్ తమ ఎమ్మెల్యేలకు మరోసారి క్లాస్ తీసుకోవడం విశేషం. తాడేపల్లిలో ఇటీవల తమ పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు, జిల్లా

10 లో

నెల్లూరొస్తున్న
మన వెంకయ్య



భారతదేశ 13వ ఉపరాష్ట్రపతిగా అత్యంత సమర్థవంతంగా సేవలందించి, నెల్లూరు ఖ్యాతిని, కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన సింహపురి ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా పదవీ విరమణ పొందిన తరువాత తొలిసారిగా తమ పుట్టినిల్లు నెల్లూరుకు వస్తున్నారు. అక్టోబర్ 2వ తేది సాయంత్రం జిల్లాకు చేరుకోనున్న ఆయన అక్టోబర్ 5 వరకు ఇక్కడే ఉంటారు. చాలాకాలం తరువాత జిల్లాకు వస్తున్న తమ ప్రియతమ నేతకు స్వాగతం చెప్పడానికి మన వెంకయ్య ఆత్మీయులు, ఆప్తులు, భారతీయ జనతా పార్టీ శ్రేణులు భారీ సన్నాహాలు చేస్తున్నారు.

5 లో

పదవులకే మీరు అలంకారం...

అలంకరించిన ప్రతి పదవికి వన్నె తెచ్చారు..
ప్రజా హృదయాలను గెలిచారు.

మచ్చలేని మహోన్నత!
దేశ 13వ ఉపరాష్ట్రపతిగా అత్యున్నత పదవికి
మీరు తెచ్చిన చారిత్రాత్మక ఘనత!
తెలుగు జాతి గర్వించే సువర్ణాక్షర చరిత!

సరిపోల్చలేని ప్రత్యేక శైలి!
స్నేహ సంపదలో దేశంలోనే అగ్రగణ్యులు
విస్తృత పర్యటనలతో
విరామమెరుగని మీ పయనం! అలుపే తెలియని మీగళం!
ఆశ్చర్యం - అద్భుతం అమోఘం - అనన్య సామాన్యం!
మీ విశేష అనుభవాలు, విలువ కట్టలేని
మీ మహా జ్ఞాన సంపద.. భావితరాలకు
మార్గదర్శకాలుగా నిలవాలని ఆకాంక్షిస్తూ..
దైవ సమానులైన మీకు భక్తితో...
ఆత్మీయ అభివందనం.

నా ఆరాధ్యం..,
గౌరవ భారత 13వ ఉపరాష్ట్రపతి
శ్రీ ముప్పవరపు
వెంకయ్యనాయుడు గారు

డా॥ కె. కృష్ణ కిషోర్ - కె. వాసంతి

Dr. Kishore's
RATNAM SCHOOLS
NELLORE - TIRUPATI

'పిడుగు' మళ్ళీ వచ్చాడు

ఎంహెచ్ఓగా రెండవసారి బాధ్యతలు చేపట్టిన వెంకటరమణ

నెల్లూరు నగరంలో కుళ్ళిపోయిన ఆహారపదార్థాలతో అనేక హోటళ్ళు, దుకాణాలు ప్రజల ఆరోగ్యాన్ని సర్వ నాశనం చేస్తున్న వేళ ఆ దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ, పెద్దఎత్తున జరిమానాలు విధిస్తూ వారి ఆటకట్టించి నగర ప్రజల అభినందనలు అందుకున్న 'పిడుగు' మళ్ళీ వచ్చాడు. గతంలో ఎంహెచ్ఓగా ఉన్న ఆయన తనిఖీలు, దాడులు నగరంలో అక్రమార్కుల గుండెల్లో దడ పుట్టించాయి. ప్రజలకు వండివార్చడానికి పలు హోటళ్ళల్లో ఫ్రీజర్లలో పెట్టి నిల్వచేసి ఉన్న వేల కేజీల పురుగులు పట్టిన మాంసాన్ని కూడా ఆయన ఆధ్వర్యంలో బట్టబయలు చేసి సంచలనం సృష్టించారు. దీంతో ఆయనపై అప్పట్లో పెద్దఎత్తున వత్తిడులే వచ్చాయి. అయినా, అన్నిరకాల వత్తిడులను సమర్థవంతంగా ఎదుర్కొన్న డాక్టర్ పిడుగు వెంకటరమణ విధి నిర్వహణలో వెనుకడుగు వేయకుండా ఇంటిపేరుకు తగ్గట్టుగానే 'పిడుగు' అనిపించుకున్నారు. ఆ తర్వాత ఆయన తన డెప్యుటేషన్ పూర్తికావడంతో నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి స్థానం నుంచి మాతృశాఖ(వైద్యఆరోగ్యశాఖ)కు వెళ్లిపోయారు. ఇప్పటిదాకా ఆ శాఖలో ఎన్సిడి విభాగం అధికారిగా పనిచేస్తున్న వెంకటరమణను తాజాగా మళ్ళీ నెల్లూరు కార్పొరేషన్ ఎంహెచ్ఓగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులివ్వడంతో డాక్టర్ పి.వెంకటరమణ ఈనెల 26న బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఆమేరకు బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన మర్యాదపూర్వకంగా కార్పొరేషన్ కమిషనర్ హరితను కలుసుకున్నారు. ఎంహెచ్ఓ స్థానంలో ఉన్న డా.అమరేంద్రనాథ్‌రెడ్డిని విడవలూరు మండలంలోని రామతీర్థం పిహెచ్‌సి వైద్యునిగా బదిలీచేశారు.

గ్రామాల అధ్యయనంలో..శిక్షణా ఐఏఎస్‌లు

ముస్సోరిలోని లాల్‌బహదూర్‌శాస్త్రి జాతీయ పరిపాలన అకాడమీలో శిక్షణలో ఉన్న ఏడుగురు ఐఏఎస్ అధికారులు ఈనెల 25న జిల్లాలో పర్యటించారు. గ్రామాల పరిస్థితులను అధ్యయనం చేసే కార్యక్రమంలో భాగంగా వారు క్షేత్రస్థాయి పరిశీలనలకు జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. బృంద నాయకురాలు అన్నుప్రియ నేతృత్వంలో ముస్సోరి నుండి శిక్షణలో ఉన్న ఐఏఎస్ అధికారులు అర్పిత్ గుప్తా, హర్‌కీరత్ సింగ్, పంకజ్ యాదవ్, రత్నేష్ చంద్ జైన్, సోనం టాబ్జే, సౌమ్య రంజన్ ప్రధాన్‌లు ఈ పర్యటనలో ఉన్నారు. వారికి నెల్లూరులోని డిఆర్‌డిఏ పీడీ సాంబశివరావు సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. డ్వామా పీడీ వెంకటరావు, డిపిఓ ధనలక్ష్మి, తహశీల్దారు రవీంద్రబాబు, ఎంపిడిఓ స్వరూపారాణి, సర్పంచ్ వెంగమ్మ వారికి స్వాగతంపలికి గ్రామం పరిస్థితులను తెలియజేశారు. అక్టోబర్ ఒకటో తేదీ వరకు జిల్లాలో వివిధ అంశాలపై వారు అధ్యయనం చేయనున్నారు.

విధులు, నిధులు లేవంటూ.. భిక్షాటన

• వినూత్న రీతిలో సర్పంచ్‌ల నిరసన

రాష్ట్రంలో పంచాయతి సర్పంచ్‌లకు విధులు, నిధులు లేవని ఆందోళన వ్యక్తం చేస్తూ జిల్లా సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌లు నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈనెల 26న నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ కూడలి వద్ద నుంచి కలెక్టరేట్ వరకు భిక్షాటన చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నాందోళన చేసి, జేసీ కూర్మనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. 14-15వ ఆర్థికసంఘం నిధులను గ్రామపంచాయతీల ఖాతాల్లో జమచేయాలని సర్పంచ్‌లు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం రాష్ట్రంలోని గ్రామాలకు పంపిన నిధులు ఏమయ్యాయో తెలియడం లేదన్నారు. గ్రామ సచివాలయాలను, వలంటీర్లను సర్పంచ్‌ల ఆధీనంలోకి తీసుకురావాలన్నారు. ఈ నిరసనలో సర్పంచ్‌లు కందమూరి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, కె.మునీష్, జి. పెంచలయ్య, జె.రాజగోపాల్‌రెడ్డి, జి.పావని, కె. అమరావతి, చిట్టేటి కవిత, రాజకుమారి, డాక్టర్ ప్రవీణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి కాకాణి

మహిళా సాధికారతే ప్రధాన లక్ష్యంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఈనెల 25న ముత్తుకూరు మండల కేంద్రంలో వైఎస్ఆర్ చేయూత పథకం కింద 3వ విడత ఆర్థిక సాయాన్ని ముత్తుకూరు మండలానికి చెందిన 3,510 మంది లబ్ధిదారులకు 6.58 కోట్ల రూపాయల మెగా చెక్కును మంత్రి అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి సంపూర్ణంగా అమలు చేసినందువల్లనే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటికి సగర్వంగా వెళుతున్నామన్నారు. ప్రతి గడపలోను ప్రజలు తమకు సాదర స్వాగతం పలుకుతున్నారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో వైఎస్ ఆర్ చేయూత పథకం కింద మూడు విడతల్లో 86.75 కోట్ల రూపాయల ఆర్థిక సాయాన్ని 46,265 మంది లబ్ధిదారులకు అందించడం జరిగిందని, 3వ విడతలో 3,510మంది లబ్ధిదారులకు 6.58 కోట్ల రూపాయల సాయాన్ని అందిస్తున్నామని మంత్రి వివరించారు.

అక్టోబర్‌లో మత్స్యకారేతర ప్యాకేజీ

2019, ఏప్రిల్11 నాటికి ముత్తుకూరు మండలంలో తెల్లరేషన్ కార్డులు ఉన్న కుటుంబాలన్నింటికి ఇచ్చిన మాట ప్రకారం మత్స్యకారేతర ప్యాకేజీ ఆర్థిక సాయం కింద ఒక్కొక్క కుటుంబానికి 25 వేల రూపాయలను అక్టోబర్ నెలాఖరులోగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందించనున్నట్లు మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇప్పటికే అందుకు సంబంధించి సుమారు 37 కోట్ల రూపాయల నిధులను ముఖ్యమంత్రి మంజూరు చేశారన్నారు. నేలటూరు పాలెం వద్ద రూ 50 కోట్లతో ఫిషింగ్ జెట్టి నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు కూడా ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అభినందన

విఎస్‌యు ఎన్ఎస్ఎస్ వలంటీర్లను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈనెల 26న విఎస్‌యులో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులను అందుకున్న సిహెచ్ పార్థసారధి (కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల), డి.సాత్విక (జగన్స్ డిగ్రీ కళాశాల), పి.వెంకటచైతన్య (కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల)లను ఆయన అభినందిస్తూ, ఉత్తమ సేవల ద్వారా రాష్ట్ర, జాతీయస్థాయిల్లో ఖ్యాతినందుకోవడం జిల్లాకు గర్వకారణమన్నారు. విఎస్‌యు వీసీ ఆచార్య జిఎం సుందరవల్లి తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి బాధితులకు పౌష్టికాహారం

అందజేసిన విఎస్‌యు వీసీ సుందరవల్లి

జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఇటీవల స్థానిక బివినగర్‌లో ఉన్న డామియన్ ఫౌండేషన్ లెప్రసి హాస్పిటల్‌లో విఎస్‌యు ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కుష్ఠువ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం అందజేశారు. విఎస్‌యు ఉపకులపతి ఆచార్య జి.యం సుందరవల్లి ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్న కుష్ఠువ్యాధిగ్రస్తులను ఆత్మీయంగా పలకరించి, వారి బాగోగులను ఆమె అడిగి తెలుసుకున్నారు. డామియన్ ఫౌండేషన్ వారు క్షయవ్యాధి బాధితులకు, కుష్ఠువ్యాధి గ్రస్తులకు చేస్తున్న సేవలు అద్భుతమని ప్రశంసించారు. ఉపకులపతి మాట్లాడుతూ కుష్ఠువ్యాధి ఒక్కప్పుడు ప్రాణాంతకమైనదని, కానీ నేటి అధునాతనకాలంలో కుష్ఠువ్యాధి నయం అయ్యేందుకు వైద్యం అందుబాటులో ఉందని చెప్పారు. బాధితులకు తగు చికిత్సలద్వారా ఈ వ్యాధి నుంచి పూర్తిగా విముక్తి కలిగించవచ్చునని అన్నారు. అనంతరం ఉపకులపతి చేతుల మీదుగా కుష్ఠువ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని పంపిణీచేశారు. విఎస్‌యు రిజిస్ట్రార్ డా. పి.రామచంద్రారెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. ఉదయ్ శంకర్ అల్లం, డా. సిహెచ్ విజయ, డా. కె.సునీత, డా. నీలమణికంఠ, డా. బి.వి. సుబ్బారెడ్డి, డా. శంకర్, ఏ జ్యోత్స్న, డామియన్ ఫౌండేషన్ సిబ్బంది ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్ సతీష్, డా. గిరి, డా. శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పార్థసారథిని అభినందించిన.. విఎస్‌యు వీసీ :

ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఇటీవల ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీర్ అవార్డును అందుకున్న విఎస్‌యు ఎన్ఎస్ఎస్ వలంటీర్ సిహెచ్ పార్థసారథిని విఎస్‌యు వీసీ ఆచార్య జిఎం సుందరవల్లి అభినందించారు. విఎస్‌యు రిజిస్ట్రార్ డా. పి. రామచంద్రారెడ్డి, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డా. ఉదయ్ శంకర్ అల్లం తదితరులు పాల్గొన్నారు.

పొణకా రామరాఘవరెడ్డి..

దేహ సమర్పణ

పినాకిని దేహసమర్పకుల సంస్థ సభ్యులు, నెల్లూరు ఆదిత్య నగర్‌కు చెందిన పొణకా రామ రాఘవరెడ్డి ఇటీవల తన 86వ ఏట పరమపదించగా, వారి దేహాన్ని నెల్లూరులోని నారాయణ వైద్యకళాశాలలోని శరీర నిర్మాణశాస్త్ర విభాగానికి వారి కుటుంబసభ్యులు సమర్పించారు. రామరాఘవరెడ్డి కుమార్తె నేదురుమల్లి నిర్మల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పినాకిని దేహ సమర్పకుల సంస్థ నిర్వాహకులు తిక్కవరపు సుకుమార్‌రెడ్డి తెలిపారు. రామరాఘవరెడ్డి నేత్రాలను ప్రభుత్వ వైద్యశాల నేత్ర విభాగానికి, దేహాన్ని నారాయణ కళాశాల ఆచార్యులైన కె.ఆశాలతకు సమర్పించడం జరిగిందన్నారు. ఇది వారింట్లో రెండవ దేహ సమర్పణ కార్యక్రమమని ఆయన పేర్కొన్నారు. నేత్ర నిపుణులు బుర్రి లాలేశ్, మంచికలపాటి బాలాజీ, వైద్యకళాశాల సిబ్బంది కొల్లు రమేష్, అలగల వెంకట రమణయ్య, డాక్టర్ సందేశ్ రాయకర్, రామచంద్రారెడ్డి, సంస్థ సభ్యులు యంత్ర పాటి వెంకటసుబ్బారావు సహకరించారని పేర్కొంటూ, దేహ సమర్పణోద్యమానికి దోహదపడుతున్న వారందరికీ ఆయన ఈ సందర్భంగా తన ధన్యవాదాలు తెలిపారు.

తప్పనిసరిగా టీకాలు వేయించాలి

జిల్లాలోని అన్ని పిహెచ్‌సిలు, యుపిహెచ్‌సీల పరిధిలో ఉన్న చిన్నారులు, గర్భిణులకు వ్యాధినిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని, ఈ లక్ష్యాన్ని నూటికి నూరుశాతం సాధించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి సెలీనాకుమారి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. నెల్లూరులోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ఈనెల 27న ఆత్మకూరు డివిజన్‌లోని నోడల్ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. పోలియో, క్షయ, పచ్చకామెర్ల వంటి వ్యాధులు రాకుండా నివారించడానికి టీకాలు ముఖ్యమని ఆమె వారికి చెప్పారు. డిపిహెచ్ఎన్ఓ మంజుల, ఏఇఇఓ నరసింహారావు, డిసిఎం సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆ మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

- జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, గొప్ప సంఘ సంస్కర్త పొణకా కనకమ్మ, 'కవికోకిల' అనే పేరును ఇంటి పేరులో ఇముడ్చుకుని ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రముఖ కవిగా ప్రత్యేకంగా గుర్తింపుపొందిన దువ్వూరు రామిరెడ్డిల జీవితాలు భావితరాలకు ఆదర్శం కావాలని నెల్లూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. ఈనెల 29 గురువారం పొణకా కనకమ్మ ఆశయ సాధన సమితి, 'కవికోకిల' దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి వారి అధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాల్‌లో కవికోకిల దువ్వూరు రామిరెడ్డి పోస్టల్ కవర్, పుస్తకావిష్కరణ కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు ముఖ్యఅతిథులుగా పాల్గొని ఆ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పినాకిని రత్నదీపం, హిందూ-పద-పాదషాహీ పుస్తక ఆవిష్కరణ, కవికోకిల దువ్వూరు రామిరెడ్డి పేరుతో రూపొందించిన పోస్టల్ కవర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆనం అరుణమ్మ మాట్లాడుతూ, ఆడపిల్లలకు విద్యను అందించాలన్న సంకల్పంతో నెల్లూరులో కస్తూరిదేవి హైస్కూల్‌ను ఏర్పాటు చేయడంతోపాటు, పల్లెపాడులో పినాకిని గాంధీ ఆశ్రమం ఏర్పాటుకు పొణకా కనకమ్మ చేసిన కృషి అపూర్వమన్నారు. కవికోకిల దువ్వూరు రామిరెడ్డి తన రచనల ద్వారా ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎంతో ఖ్యాతిగాంచారని, బహుభాషా కోవిదునిగా కొత్తతరానికి సాహితీ బాటలు వేశారని కొనియాడారు. జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ, ఎంతోమంది నెల్లూరీయులు వివిధ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని గడించారని, అలాంటి వారిలో పొణకా కనకమ్మ, దువ్వూరు రామిరెడ్డిలు ఉండడం గర్వకారణమన్నారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు డివిజన్ పోస్ట్ ఆఫీస్ సూపరింటెండెంట్ ఎస్.రామకృష్ణ, దువ్వూరు రామిరెడ్డి విజ్ఞాన సమితి కోశాధికారి చెలంచెర్ల భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కొండా లక్ష్మీ కాంత్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, జయప్రకాష్, పొణకా కనకమ్మ ఆశయ సాధన సమితి కోశాధికారి గూడూరు లక్ష్మి , రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రంగయ్య నాయుడు, చల్లా పెంచలరెడ్డి, లతీఫ్ కుట్టి, సురేంద్రనాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిసిసిబిలో.. ఇక 'మొబైల్ బ్యాంకింగ్' యాప్

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి)లో కొత్తగా మొబైల్ బ్యాంకింగ్ యాప్‌తో సేవలందించనున్నారు. ఈ యాప్‌కు సంబంధించిన వివరాలతో కూడిన పోస్టర్‌ను అధికారులతో కలసి డిసిసిబి ఛైర్మెన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఈనెల 28న ఆవిష్కరించారు. నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ కూడలి వద్ద ఉన్న డిసిసిబి ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రైతుల బ్యాంక్‌గా డిసిసిబి పేరు పొందిందని, ఇప్పుడు వాణిజ్య బ్యాంకులకు ధీటుగా టిసిఎల్ కంపెనీ సహకారంతో మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. జిల్లాలోని అన్ని డిసిసిబి శాఖలకు ఈ సేవలు అందుతాయని, సొసైటీల్లో కూడా నెట్‌బ్యాంకింగ్ విధానాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మొబైల్ బ్యాంకింగ్ సిస్టం ద్వారా నగదు లావాదేవీల నిర్వహణంతా ఫోన్‌లోనే జరుపుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి సిఇఓ డా.శంకర్‌బాబు, బ్యాంక్ డైరెక్టర్లు ఖాదర్ ఆలీ, రమణయ్య, వెంకటరమణయ్య, డిసిఓ తిరుపాల్‌రెడ్డి, సహకారశాఖ ఆడిట్ అధికారి తిరుపతయ్య, డిసిసిబి జనరల్ మేనేజర్ సరిత, నాబార్డ్ డిడిఎం రవిసింగ్, బ్యాంక్ డిజిఎంలు ఉషారాణి, నాగేంద్రకుమారి, దయాకర్‌రెడ్డి, సుధాభారతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కావాలంటే..టిడిపి రావాలి

- మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరోసభ్యులు సోమిరెడ్డి

తెలుగుదేశం పార్టీ హయాంలోనే ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు వచ్చాయని, మళ్ళీ ఆ సంక్షేమం చూడాలంటే టిడిపి అధికారంలోకి రావాలని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరోసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రజలకు వివరించారు. ఈనెల 29న ఆయన మనుబోలు మండలం వీరంపల్లి గ్రామంలో 'బాడుదే బాడుదు' కార్యక్రమం నిర్వహించి అన్ని వర్గాల ప్రజలను కలసి టిడిపి పాలనలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఏ ఊరికి వెళ్ళినా టిడిపి చేసిన అభివృద్ధే కనిపిస్తోందని, వైకాపా నాయకులు చేసిందేమీ లేదని తెలిపారు. అవినీతి అక్రమాలకే వారికి కాలం సరిపోతోంది కానీ ప్రజల సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు.

దేవిరెడ్డి శారద ట్రస్ట్ సేవలు అపూర్వం

అల్లూరు మండలంలోని దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ వారు చేస్తున్న సామాజిక సేవలు అపూర్వమని తహశీల్దార్ రామకృష్ణ ప్రశంసించారు. ఇటీవల ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని టైలరింగ్ శిక్షణ పూర్తిచేసుకున్న 34 మంది మహిళలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ దశరథరామిరెడ్డి, ఆర్ఐ సుధీర్, ట్రస్ట్ మేనేజర్ అనిల్‌కుమార్‌రెడ్డి, నైపుణ్య శిక్షణ నిర్వాహకులు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బాగుపడని రోడ్లు.. పల్లెప్రజల పాట్లు

ఏళ్ళు గడిచిపోతూనే ఉన్నాయి. ప్రభుత్వాలు మారిపోతున్నాయి. పాలకులూ మారిపోతూనే ఉన్నారు. గ్రామస్వరాజ్యం తెస్తామంటూ నాయకులు గొప్పగొప్ప మాటలు చెప్తూనే ఉన్నారు. కానీ కాలం గడిచిపోతూనే ఉందే తప్ప, ఆచరణలో మాత్రం అనాదిగా పల్లెల దుస్థితిలో ఎలాంటి మార్పు ఉండడం లేదు. ఎక్కడ చూసినా రోడ్లు అత్యంత అధ్వాన్నంగానే ఉంటున్నాయి. పల్లెల బాగుకు అవసరమైన నిధులు లేవు. పనులు చేయించాల్సిన సర్పంచ్‌లు నామమాత్రమే అయిపోతున్నారు. ప్రజలకు మాత్రం పాట్లు తప్పడం లేదు. ఈ దుస్థితి ఎప్పుడు మారుతుందో మరి!...

జిల్లాలో గ్రామీణప్రాంతాల్లో రోడ్లు, ఆయా గ్రామాలకు వెళ్లే కొన్ని ప్రధానమైన రోడ్డు కూడా సక్రమంగా ఉండడం లేదు. దారిడొంకలు లేని గ్రామాలెన్నో నేటికీ ఉన్నాయి. వాహనాల్లో కూడా వెళ్ళడానికి వీలుకాక అనునిత్యం ప్రజలు పడే అవస్తలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా ఈ దుస్థితిలో ఎలాంటి మార్పు ఉండకపోవడం పట్ల గ్రామీణ ప్రజల్లో అసంతృప్తి, ఆవేదన వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో కొన్ని మారుమూల గ్రామాలకైతే ఇప్పటికీ రోడ్లన్న మాటే లేదు. కాలిబాటలు, అడవిదారుల గుండా, కొండగుట్టల మీదుగా ఎంతో అవస్తలు పడి వెళ్ళాల్సివస్తోంది. అక్కడ నుంచి ఏదైనా అవసరం వచ్చి దూరంగా ఉన్న పట్టణాల్లో ఏ ఆసుపత్రికో, కళాశాలకో వెళ్ళాలంటే ఆ గ్రామాల మీదుగా పట్టణాలకు కూడా రోడ్లు సరిగ్గా లేక, ప్రయాణం నరకయాతనగా ఉంటోంది. ఒక్కోచోట ప్రధాన రహదారులు కూడా గుంతలు పడి ఉండడం, వాటిని బాగు చేసే నాధులు లేకపోవడంతో పట్టణ ప్రాంతాలకు వెళ్ళే రోడ్లు కూడా పరమ అధ్వాన్నంగా ఉంటున్నాయి. అయినా పట్టించుకునేవారేరీ?..

ఎగుడుదిగుడు రోడ్లే దిక్కు

నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే అనేక ప్రధాన రహదారులు కూడా ఎగుడుదిగుళ్ళుగా, గుంతలుమిట్టలుగా, కంకర తేలిపోయి, ప్రయాణం చేయాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అన్నంత ఘోరంగా ఉన్నాయి. రోడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు కూడా జిల్లాలో విపరీతంగానే ఉన్నాయి. ఉదాహరణకు వింజమూరు-రాజోలు రోడ్డు కానీ, పొదలకూరు- మనుబోలు ప్రధాన రహదారిలో వీరంపల్లి గ్రామం వద్ద ఉన్న రోడ్డు కానీ, మనుబోలు మండలంలోని పిడూరు రోడ్డు, గురువిందపూడి రోడ్డు కానీ.. నెల్లూరు నగరం చుట్టుపక్కలున్న అనేక గ్రామాల రోడ్లు కానీ.. ఇలా చెప్పుకుంటూపోతే జిల్లాలోని దాదాపు అన్ని గ్రామాల్లో రోడ్ల దుస్థితి చెప్పలేనంత ఘోరంగా ఉంది. ఇక, కొండ ప్రాంతాల్లో రోడ్ల సంగతిని కానీ, సముద్ర తీరప్రాంతాల్లో ఉన్న మారుమూల గ్రామాల్లో రోడ్ల దుస్థితిని కానీ పట్టించుకునే వారే లేరు.

పట్టణాలకు ఆనుకుని ఉన్న గ్రామాల రోడ్లు, పెద్దపెద్ద గ్రామాలుగా పేరున్న ప్రాంతాల్లో కూడా రోడ్లు భయంకరంగానే ఉంటున్నాయి. రోడ్లు లేని గ్రామాలకు కొత్త రోడ్లు వేయడం కానీ, పాడైపోయిన పాత రోడ్లను ఎప్పటికప్పుడు బాగుచేసే యంత్రాంగం కానీ నేటికీ లేకపోవడం విచారకరం.

నిధులు లేక నీరసం

కొన్నిచోట్ల పంచాయతీల వారు కాస్త శ్రద్ధ చూపుతున్నా అవసరమైన నిధులు కరువు. దీంతో ఏ పనిచేయాలన్నా నీరసపడిపోతున్నారు. అత్యవసరమైన మంచినీరు, పారిశుద్ధ్య నిర్వహణ వంటివాటికే సక్రమంగా నిధులు లేకపోవడంతో, ఇక రోడ్లకు ప్రతిపాదనలు పెట్టి ప్రయోజనం ఏముందని రోడ్లపై ఆశలు వదిలేసుకుంటున్నారు. గ్రామ పంచాయతీలకు నిధులు కానీ, చేయదగిన విధులు కానీ లేకపోవడంతో పల్లెపట్టులన్నీ అనాదిగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగా ఉంటున్నాయి. ఇక గ్రామాల అభివృద్ధి ఎక్కడ?..మాటల్లో తప్ప ఆచరణ లేని పథకాలు ఎన్ని వల్లించినా ప్రయోజనం ఏముంది?.. ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు పుష్కలంగా నిధులిస్తే తప్ప ఈ సమస్యలు తీరవు. జిల్లాలోని నాయకులు, ఉన్నతాధికారులన్నా ఈ విషయాలు గట్టిగా పట్టించుకుంటే కొంతలో కొంతైనా మార్పు జరుగుతుంది. అదిలించే అధికారులుండాలే గానీ చేయలేనిదేముంటుంది?... రోడ్లు భవనాలనే శాఖ ఒకటుంది కదా!..ఎక్కడెక్కడ రోడ్లు బాగలేవో, ఏఏ గ్రామలకి అసలు రోడ్లే లేవో అధికారుల బృందాలు, నిపుణుల బృందాలతో కలసి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి నాయకులు, ఉన్నతాధికారులే స్వయంగా రంగంలోకి దిగితే తప్ప.. ఈ రోడ్ల సమస్యలు ఒక దారికి రావు.

లాయర్
సెప్టెంబర్ 30, 2022

రైతన్నలకెన్నాళ్ళీ..'ఆత్మక్షోభ'?..

దేశంలో నానాటికీ వ్యవసాయ రంగం కుదేలైపోతోంది. సమస్యల ఊబిలో పడి సేద్యం సంక్షోభంగా మారింది. ఆరు గాలం కష్టించి పంటలు పండించే రైతులు అష్టకష్టాల్లో పడి అల్లాడిపోతున్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి కానీ, వారి సంక్షేమానికి కానీ ప్రభుత్వాలు ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోకపోవడంతో రైతుల బతుకులు దుర్భరంగా మారిపోతున్నాయి. రానురాను సేద్యం పెనుభారం కావడం, ఖర్చులు పెరిగి..అప్పులు అధికం కావడంతో జీవితాలపై విరక్తిచెందుతూ అనేకమంది రైతన్నలు అటు కాడినీ, ఇటు ప్రాణాల్నీ కూడా వదిలేసుకుంటున్న దుస్థితి దాపురిస్తోంది. ఒక్క 2021లోనే దేశంలో కనీసం 11 వేల మంది దాకా రైతులు, రైతుకూలీలు ఆత్మహత్యలు చేసుకున్నట్లు జాతీయ నేర గణాంక సంస్థ తాజా నివేదికలో పేర్కొంది. అందులోనూ మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్ర, తెలంగాణాల్లో ఈ ఆత్మ హత్యలు అధికంగా ఉన్నట్లు, అందరికీ అన్నం పెట్టే అన్నపూర్ణ వంటి ఆంధ్రలో సైతం రైతుల ఆత్మహత్యలు గతంలో కంటే బాగా పెరిగినట్లు కూడా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ కష్టాలు మరెప్పటికి తీరుతాయో తెలియడం లేదు. దేశంలో అత్యధికశాతం ప్రజలు వ్యవసాయరంగంపైనే ఆధార పడి జీవిస్తున్నారన్నది అందరికీ తెలిసిందే. వీరిలో ఎక్కువ మంది పేద, సన్న-చిన్నకారు రైతులే. పంటలకు తగిన గిట్టు బాటు ధరలు లేకపోవడం, పంట ఖర్చులు ఎక్కువ కావడం, దీంతో పంటలకోసం అప్పులు చేయడం, ఆ అప్పులు తీరకుండానే వడ్డీలకు వడ్డీలు పెరిగిపోతుండడం, ఆర్థికంగా కుటుంబాల స్థితిగతులు బాగలేకపోవడం, వీటికి తోడు అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి విపత్తులు మరోవైపు రైతుల బతుకుల్ని అల్లకల్లోలం చేయడం..ఇలా ఎన్నో రకాల కారణాలు రైతుల్ని ఆత్మహత్యల దాకా తీసుకువెళ్తున్నాయి.

వరికి పుట్టినిల్లయిన మనదేశంలో వరి రైతులకు గిట్టు బాటు ధరలు ఉండకపోవడం దారుణం. మార్కెట్ సదుపాయాలూ నామమాత్రమే. మరోవైపు ఎగుమతులపై లేనిపోని ఆంక్షలతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంటోంది. ప్రపంచవ్యాప్తంగా బియ్యం ధరలు పెరిగినా, మన దేశంలో ఇటీవల ఆ ఎగుమతులపై కేంద్రప్రభుత్వం 20 శాతం సుంకం విధించడం, నూకలపై ఎగుమతులను నిషేధించడంతో రైతుల పరిస్థితి అయోమయంలో పడింది. మనదేశం నుంచి ఎన్నో దేశాలకు బియ్యం ఎగుమతులు జరుగుతుండేవి. ధర వచ్చినప్పుడు అమ్ముకోగలిగితే ఎంతోకొంత ఆదాయం వస్తుందను కుంటే, ఈ కొత్త నిబంధనలతో ఎగుమతులు లేక, ఉన్న ఆదాయం కాస్తా పోయినట్లయిందని వరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశీయంగా చూసినా రైతులకు కష్టాలే. రైతుల వద్ద వ్యాపారులు ధాన్యాన్ని తక్కువ ధరలకే కొంటారు, కానీ బియ్యం ధర మాత్రం ఆకాశంలో ఉంటుంది. ఈ తేడా చూస్తే చాలు..రైతులకు-వ్యాపారులకు మధ్య అంతరం ఎంతగా ఉందో తెలిసిపోతుంది. దేశంలోని అనేక గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎన్నో రకాల పంటలు పండిస్తూనే ఉన్నారు కానీ, వాటికి సరైన గిట్టుబాటు ధరలు ఉండడం లేదు. మార్కెట్లలో తమంత తాము అమ్ముకునే పరిస్థితులు లేకపోవడంతో రైతులు మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించక తప్పడం లేదు. అదే అదనుగా వారు రైతులను నిలువునా ముంచేస్తుండడం సర్వసాధారణమైపోయింది. ఏళ్ళతరబడిగా రైతులకు ఈ అన్యాయం జరుగుతూనే ఉంది. దళారుల ప్రమేయం లేకుండా అన్ని రకాల పంటలను ప్రభుత్వాలే మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేసే విధానాలు దేశవ్యాప్తంగా అమలుకావడం లేదు. మార్కెట్ సదుపాయాలు అందరికీ అందుబాటులో లేకపోవడంతో అయినకాడికి అమ్ముకుంటూ రైతులు కన్నీళ్లతోనే జీవితాలను సాగిస్తున్నారు. ప్రభుత్వాలెన్ని మారినా, పాలకులు మారినా రైతుల బతుకులు మాత్రం అనాదిగా మారడమే లేదు. ఎప్పటికప్పుడు నాయకులు రైతులను ఉద్ధరిస్తున్నామని గొప్పలు చెప్పుకోవడమే తప్ప, వారికి చేసింది శూన్యమే. ఎంతటి విలువైన ఉత్పత్తులైనా రైతులు మార్కెట్లలో కూటినీళ్ళకు అమ్ముకోవాల్సిన దుర్గతి. ఇంకా ఎంతకాలం ఈ కష్టాలు కన్నీళ్లు?..రైతులకెన్నాళ్ళీ ఆత్మక్షోభ?.. ఇకనైనా కేంద్రం, రాష్ట్రప్రభుత్వాలు, నాయకులు అందరూ కలసి రైతుల సమస్యలను, వారి జీవనపరిస్థితులను కూలంకుషంగా పరిశీలించి, రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకునేందుకు తగ్గ ప్రణాళికలు రూపొందించి వెంటనే అమలు చేయాల్సి ఉంది. దేశానికి వెన్నెముకలైన రైతన్నల వెన్ను విరగకుండా, అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడకుండా.. వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి ఉంది.

'యుటీగా హైదరాబాదు' సముచిత నిర్ణయం అవుతుంది!

'హైదరాబాద్ జిందాబాద్' పేరుతో గత వారం 'లాయర్'లో వచ్చిన వార్త ఆచరణ రూపం దాలిస్తే చాలా బాగుంటుంది. కాంగ్రెస్ అధినేత్రి అహంభావ నిర్ణయం, ఆంధ్ర రాష్ట్ర రాజకీయపార్టీల స్వార్థపూరిత ప్రయోజనాల ఫలితంగానే తెలంగాణ ఏర్పడింది తప్ప, ఉద్యమాల కారణంగా మాత్రం కానే కాదు. ఈ విషయం అందరికీ తెలిసిందే. రాజశేఖరరెడ్డి వారసుడు జగన్ మోహన్‌రెడ్డిని ఒక్కడిని దృష్టిలో పెట్టుకుని దాదాపు 5కోట్ల మంది ఆంధ్రుల భవిష్యత్తును తాకట్టు పెట్టింది ఆ మహాతల్లి. ఇటలీ రాణి నిర్ణయానికి కాంగ్రెస్ వృద్ధ జంబూకాలు కూడా వత్తాసు పలికాయి. హైదరాబాదు తరహాలో ఒక రాజధాని మళ్ళీ ఆంధ్రాలో ఏర్పడాలంటే కనీసం మరో నలభై సంవత్సరాలు పడుతుంది, అంతకంటే ఎక్కువే పట్టినా ఆశ్చర్యపోనవసరం లేదు. అప్పటికి కొన్ని తరాలు తరలిపోతాయి.

హైదరాబాదును తెలంగాణ నుండి వేరుచేస్తే రాష్ట్ర విభజన వల్ల ఆవేదనతో, ఆక్రోశంతో రగిలిపోతున్న లక్షల మంది హృదయాలు శాంతిస్తాయి. మొన్నటివరకు కలిసిమెలసి జీవించిన ఒకే రాష్ట్రం ఇప్పుడు రెండు ముక్కలైన తరువాత, తెలంగాణ రాష్ట్రం నుండి ఆంధ్రాలోకి రావలసినప్పుడల్లా ఆంధ్ర సరిహద్దులో పోలీసులు చేస్తున్న హడావుడి అనేక మంది తెలుగు కుటుంబాలు అవమానంగా భావిస్తున్నాయి. ఉమ్మడి రాజధానిగా పదేళ్ళు హైదరాబాదుపై ఆంధ్రులకు హక్కున్నా ఆ నిర్ణయాలు, నిబంధనలు గాలికెగిరిపోయిన పరిస్థితులను చాలామంది జీర్ణించుకోలేక పోతున్నారు. 'లాయర్'లో రాసినట్లుగా హైదరాబాదును ప్రత్యేక కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించి, దేశ రెండవ రాజధానిగా చేస్తే భారతీయ జనతా పార్టీకి అటు హైదరాబాదులో నివసిస్తున్న తెలుగు వారితో పాటు ఆంధ్రులు కూడా బ్రహ్మ రథం పడతారు. అంతేకాదు భారతదేశంలోని అనేక రాష్ట్రాలనుండి హైదరాబాదుకి తరలివచ్చి స్థిరపడిన ఇతర ప్రాంత సంస్థలు, ప్రజలు కూడా సంబరాలు చేసుకుంటారు. కుటుంబ పాలనతో అరాచకాలు సాగిస్తున్న టీఆర్ఎస్ పార్టీ నుండి హైదరాబాదుకి విముక్తి కల్పించినందుకు పండుగ చేసుకుంటారు. హైదరాబాదుని తెలంగాణ నుండి వేరు చేయడం సముచిత నిర్ణయమే అవుతుంది...!

కామిరెడ్డి వేణుగోపాలరెడ్డి,
హిమాయత్‌నగర్, హైదరాబాదు.

ప్యాచ్ వర్క్‌ల కంటే గుంతలే నయం

నెల్లూరులో చాలాచోట్ల రోడ్లు గుంటలు పడడం మనం చూశాం. ఏదో కంటితుడుపు చర్య అన్నట్లుగా ఆ గుంతలను కొంత కంకర, బూడిద పోసి పూడ్చారు. కనీసం దానిపైన తారు కూడా పోయలేదు. వాహనాలు వాటిపై వెళుతున్నప్పుడు దుమ్ము తీవ్రంగా లేస్తోంది. మరోవైపు వర్షం వస్తే ఆ కంకర అంతా పోయి పెద్ద గుంతల స్థానంలో మరిన్ని గుంతలు ఏర్పడుతున్నాయి. దాంతో ఆ ప్యాచ్‌వర్క్‌లపై వెళ్లే వాహన దారులు ఇంతకు ముందున్న పెద్ద గుంతలే నయం రా బాబూ! అనుకుంటున్నారు.

జె.యస్.కృష్ణ, నెల్లూరు.

ల్యాబ్‌ల పేరుతో లూటీ!

పాతరోజుల్లో రోగులకు వచ్చిన వ్యాధులేమిటో, వారి బాధలేమిటో నాడి పట్టుకుని తెలుసుకునేవారు వైద్యులు. ఎంతటి వ్యాధినైనా ఇట్టే కనిపెట్టేవారు. ఇప్పుడా పరిస్థితి ఎప్పుడో పోయింది. ఆసుపత్రులకు వెళ్తే చాలు నిపుణులైన వైద్యులు కూడా వ్యాధిని కనుగొనేందుకు ల్యాబ్‌ల మీదనే ఆధారపడుతున్నారు. అది ఎంత చిన్న జబ్బైనా సరే, రక్తపరీక్షలు, మలమూత్ర పరీక్షలు చేయడం ప్రారంభించారు. తద్వారా రోగికి ఎలాంటి వ్యాధి ఉందో నిర్ధారించుకొంటున్నారు. నేటి అధునాతన కాలంలో, వైద్యశాస్త్రం ఎంతగానో విస్తరించినా, అనేకరకాల యంత్రపరికరాలు అందుబాటులోకి వచ్చినా, అనేకమంది ప్రైవేటు వైద్యులు నేరుగా రోగులను పరీక్షించిచూసే ముందుగా ల్యాబొరేటరీ పరీక్షలకు పంపుతున్నారు. దీంతో ల్యాబ్‌లకు ఎక్కడలేని ప్రాధాన్యత వచ్చింది. అది ముదిరి పాకానపడడంతో ప్రైవేట్ ల్యాబ్‌లు ఇబ్బడిముబ్బడిగా తెరమీదికి వచ్చాయి. మంచి వైద్యులకు పేరున్న నెల్లూరు నగరంలో కూడా ఇప్పుడు అలాంటి ల్యాబ్‌లు బోలెడన్ని ఉంటున్నాయి. ఒక్క నెల్లూరనే కాదు, జిల్లావ్యాప్తంగా, రాష్ట్రం, దేశవ్యాప్తంగా కూడా ల్యాబ్‌లకు కొదవే లేదు. జబ్బు ఏదో నిర్ధారించాలనే సాకుతో వైద్యులు అడిపనిగా రోగులను ల్యాబ్‌ల చుట్టూ తిప్పుతుండడంతో కొన్ని ల్యాబ్‌లు ప్రభుత్వ నిబంధనలను కూడా లెక్కచేయకుండానే నడుస్తుంటున్నాయన్నది అందరికీ తెలిసిందే. ల్యాబ్‌లు ఉండడంలో తప్పు లేదు, అవి నిర్వహిస్తున్న పరీక్షలను కూడా తప్పుపట్టలేం.

సమస్యల తో 'రణం'

కానీ, రోగుల అవస్తలు పట్టించుకోకుండా ప్రతి రోగాన్నీ డబ్బు కోణం నుంచే చూస్తున్నపుడే విమర్శలు వస్తుంటాయి. కొన్ని ప్రాంతాల్లో ఒక్కో డాక్టర్‌కు ఒక్కో ల్యాబ్ అన్నట్లుగా కేటాయింపులు కూడా జరుగుతుండడం వెనుక లాభార్జన కాక మరేమిటి?. కొన్నిచోట్ల కొందరు ప్రైవేట్ డాక్టర్లకు, ల్యాబ్‌ల వాళ్ళకి మధ్య లావాదేవీలు మరింత ఎక్కువై, ఇరువర్గాల వారికీ 'ఆ పరీక్షలు' ఒక లాభదాయకమైన వ్యాపారంగా, కమిషన్ల రాబడికి అదొక భేషైన మార్గంగా తయారైందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మందుల విక్రయాల్లో కమిషన్లు, ల్యాబ్‌లలో కమిషన్లు కలసి వెరసి కొన్ని ప్రైవేటు వైద్యసంస్థల రాబడి లక్షలకు మించి కోట్లల్లోకి చేరిపోయినా, అవన్నీ వైద్యశాల నిర్వహణకు, అద్దె ఖర్చులకు, జీతాలకే చాలడం లేదన్నట్లు వాపోతుంటారు.. చాలా తెలివిగా. డాక్టర్ల ఫీజులు, మందుల ఖర్చులు రోగికి ఎటూ తప్పవు. అవన్నీ వేరే లెక్క. ఈలోగానే ముందుగా జేబులకు చిల్లుపెట్టేది ల్యాబ్‌లే. అయినా, ల్యాబ్‌లలో పరీక్షలు చేయించుకోకుండా రోగనిర్ధారణ ఎలా?..రక్తపరీక్షలు జరగాలి. స్కానింగ్‌లు తీయాలి. సి.టి స్కానింగ్‌లనీ, ఎంఆర్ఐ స్కానింగ్‌లని వీటిలో మళ్ళీ రకరకాలుంటాయి. అన్నీ పరీక్షలు చేసి చూస్తే తప్ప రోగమేమిటో తెలియదంటారు. చేసుకోకుంటే మాకేం పొయ్యేది లేదు..మీకే నష్టమంటారు. ఏ చిన్న దగ్గో జలుబో జ్వరమో వచ్చినా అంతే. టెస్టుల మీద టెస్టులు రాస్తూనే ఉంటారు. కాదని ఎవరనగలరు?.. ఆ బలహీనతే వారికి బలం. ఏ గుండెజబ్బులో, సీరియస్ వ్యాధులో వస్తే ల్యాబులోళ్ళకి మరీ పండగ. మరి ల్యాబ్‌లు పెట్టుకుందే అందుకు కదా!.. రోగనిర్ధారణ సంగతి అటుంచితే, ఎన్ని ఎక్స్‌రేలు రాస్తే అంత కమిషన్, ఎన్ని రకాల పరీక్షలు రాస్తే అంత లాభం అన్నట్లుగా ప్రైవేట్ ల్యాబ్‌ల వాళ్ళు, ప్రైవేట్ డాక్టర్లు అనేకమంది ఎవరికి వారు అంతర్గత ఒప్పందాలు కుదుర్చుకోవడం మామూలైపోయిందనే ఆరోపణలు కొల్లలు. పోనీ ఆ స్కానింగ్‌లు, పరీక్షల ఖర్చేమైనా చిన్నదా అంటే కాదు, నాలుగంకెలతో మొదలై వేలల్లో ఉంటుంది. ఒక్కోసారి రోగి కొంచెం అవస్తపడుతున్నట్లు కనిపిస్తే, ఆ పరీక్షల ఖర్చు అయిదంకెలు కూడా దాటిపోతుంటుంది. కొన్ని వైద్యశాలల్లోనైతే, ఎటూ డాక్టరొచ్చి రాసేది ఆ పరీక్షలే కాబట్టి, ఆ పరీక్షలన్నీ వారు చెప్పిన ల్యాబ్‌లలోనే ముందుగానే చేయించుకుని ఆ స్కానింగ్‌లను చేతబట్టుకుని కూర్చోవాల్సి ఉంటుంది. కరోనా రోజుల్లోనైతే ల్యాబ్‌ల వారికి పండగే పండగ. రోగులను పిండేశారు. అప్పటికీ ప్రభుత్వం ఎన్నోసార్లు దాడులు, తనిఖీలు చేసినా ఆ కాసేపే భయపడినట్లుంటారు. ఆ తర్వాతంతా మళ్ళీ షరా మామూలే. డబ్బున్న వాళ్లకైతే ఎట్లనో తట్టుకోవచ్చు కానీ, పేదల పరిస్థితే మరీ ఘోరం. రోగం నయం కాక, వచ్చిన జబ్బేమిటో తెలియక అవస్తలు పడుతూ పల్లెవెలుగు బస్సులు పట్టుకుని ఏ పట్టణాలకో, నగరాలకో వైద్యం కోసం వెళ్ళే బడుగుజీవులకు చివరికి అంధకారమే ఎదురవుతోంది. వైద్యం కంటే ముందుగా వేలాది రూపాయలు ఖర్చయ్యే ల్యాబ్‌ల పరీక్షలే వారికి జీవితపరీక్షలుగా తయారుకావడమే బాధాకరం. ఒక్కమాటలో చెప్పాలంటే ల్యాబ్‌లు నిరుపేద రోగుల్ని కూడా దయాదాక్షిణ్యం లేకుండా లూటీ చేసేస్తున్నాయని బాధపడేవారు కోకొల్లలు. ఏదేమైనా, పరీక్షల పేరుతో ల్యాబ్‌ల వాళ్ళు చేసే లాభార్జన వారికి ఘోరంగానో, నేరంగానో కనిపించకపోవచ్చు కానీ, రోగులకు మాత్రం అది అదనపు భారం. అందుకే 'డబ్బు లేకుంటే పర్వాలేదు కానీ..జబ్బు రాకుండా చూడు స్వామీ!.. అని ఆ దేవుడికి మొక్కుకునేవారు ఎక్కువైపోయారు. ఎంత డబ్బున్నా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తే గోయిందా!..అన్నది దాని అర్థం పరమార్థం!..అదీ సంగతి! - సంచారి

అక్టోబరు 2న వెంకయ్య రాక

భారత మాజీ ఉపరాష్ట్రపతి, మన నెల్లూరీయులు ముప్పవరపు వెంకయ్యనాయుడు అక్టోబరు 2వ తేదీన జిల్లా పర్యటనకు వస్తున్నారు. 2వ తేది సాయంత్రం 4.30 గంటలకు ఆయన వెంకటాచలంలోని స్వర్ణభారత్‌కు విచ్చేసి, అక్కడ నుంచి 3వ తేది ఉదయం 9.50 గంటలకు వెంకటాచలంలో ఉన్న అక్షర విద్యాలయాన్ని సందర్శిస్తారు. 10.35 గంటలకు స్వర్ణభారత్ ట్రస్టుకు చేరుకుని ముప్పవరపు ఫౌండేషన్ కార్యక్రమాలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం అక్షర విద్యాలయంలోని పూర్ణశాలకు వెళ్తారు. అనంతరం 3.30 గంటలకు నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో ప్రముఖులతో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొంటారు. సాయంత్ర 5.30 గంటలకు వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టుకు చేరుకుంటారు. 4వతేది ఉదయం 7.30గంటలకు పొదలకూరు మండలం ప్రభగిరిపట్నం వద్ద కిసాన్‌క్రాఫ్ట్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటేట్‌ను పరిశీలిస్తారు. 8.40 గంటలకు తిరిగి స్వర్ణభారత్ ట్రస్టుకు వచ్చి ఉదయగిరి, ఆత్మకూరు ప్రాంతాలకు చెందిన ఆత్మీయులు, స్నేహితులతో సమావేశమవుతారు. 5వ తేది ఉదయం 6.50 గంటలకు స్వర్ణభారత్ ట్రస్ట్ నుంచి చెన్నైకి బయలుదేరివెళ్తారు.

ఆర్మీ రెక్రూట్‌మెంట్ ర్యాలీ విజయవంతం

• జిల్లా యంత్రాంగం నిరంతర సేవలు

దేశమాత సేవకు అహర్నిశలు అంకితభావంతో పనిచేసే ఆర్మీకి ఎప్పుడు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందించేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈనెల 15వ తేది నుంచి 26వ తేది వరకు నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన అగ్నివీర్ ఆర్మీ రెక్రూట్‌మెంట్ ర్యాలీ విజయవంతమైన సందర్భంగా మంగళవారం ఏర్పాటుచేసిన అభినందన సభలో కలెక్టర్ మాట్లాడారు. ఈ ర్యాలీకి రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది అభ్యర్థులు హాజరయ్యారని, దేశసేవ కోసం నిర్వహించిన ఆర్టీ నియామక ప్రక్రియలో భాగంగా జరిగిన మొదటిదశ రెక్రూట్‌మెంట్ ర్యాలీ ఎటువంటి అవాంతరాలు లేకుండా, ప్రతినిత్యం క్రమశిక్షణతో పనిచేసి జిల్లాలోని వివిధ శాఖల యంత్రాంగం సేవలందించిందని ఆయన కొనియాడారు. అగ్నివీర్ రెక్రూట్‌మెంట్ ర్యాలీని విజయవంతం చేసినందుకు ఈ సందర్భంగా గుంటూరు రేంజ్ ఆర్మీ రెక్రూట్‌మెంట్ అధికారి కోహ్లీ జిల్లా కలెక్టర్‌కు, అధికార యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు. కలెక్టర్‌తో పాటు జేసీ కూర్మనాథ్, కార్పొరేషన్ కమిషనర్ హరిత, సెట్నెల్ సిఇఓ పుల్లయ్య, ఆర్డీఓ మలోల, జిల్లా ఇన్‌ఫర్మేటిక్ అధికారి సురేష్‌బాబు, డిఎస్పీలు శ్రీనివాసరావు, గాంధీ, అబ్దుల్‌సుబహాన్, ఉప రవాణా కమిషనర్ చందర్, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి వెంకటేశ్వరప్రసాద్, సహాయ కార్యనిర్వాహక సమాచార ఇంజనీర్ కిశోర్‌లతో పాటు పలువురు అధికారులను జ్ఞాపికలతో సత్కరించారు.

జామియా మసీదుకు.. నూతన పాలకవర్గం

• అభినందించిన ఆనం రామనారాయణరెడ్డి

వెంకటగిరిలోని ప్రసిద్ధ ప్రార్థనాక్షేత్రం జామియా మసీదు మరియు పీర్ల చావిడిలకు నూతన మేనేజింగ్ కమిటీ ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈనెల 26న కొత్త పాలకవర్గం బాధ్యతలు చేపట్టింది. ప్రెసిడెంట్‌గా పటాన్ గౌస్ బాషా, వైస్ ప్రెసిడెంట్‌గా ఎం.డి అలీ హబీబుల్లాహ్, సెక్రటరీగా ఎస్.డి అబుబకర్, జాయింట్ సెక్రటరీగా ఎస్‌కె హఫీజ్, ట్రెజరర్‌గా ఎస్‌కె సాజిద్‌లతో పాటు సభ్యులుగా ఎస్‌కె రసూల్ బాషా, ఎస్‌కె మున్నా, ఎస్‌కె కరిముల్లా, ఎస్‌కె షఫీ, ఎస్.డి చాన్‌బాషా ఎంపికయ్యారు. వారందరినీ వెంకటగిరి ఎమ్మెల్యే, మాజీమంత్రి అనం రామనారాయణరెడ్డి అభినందించారు. తమను కమిటీలో నియమించడానికి కృషిచేసిన ఆనం రామనారాయణ రెడ్డికి వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ముస్లిం మత పెద్దలతో కలిసి ఆయన్ను ఘనంగా సన్మానించారు.

పేదల ముఖ్యమంత్రి.. జగన్

- నెల్లూరు ఎంపీ ఆదాల

పేదల సీఎం జగన్ అని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రశంసించారు. దగదర్తిలో ఇటీవల జరిగిన పలు కార్యక్రమాల్లో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ సీఎం జగన్ పేదల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. దగదర్తి ప్రాంత రైతులకు కావలి కాలువ ద్వారా నీళ్లు రావడం కష్టంగా ఉండడంతో, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి చేసిన విజ్ఞప్తి మేరకు ఇక్కడ బైపాస్ కాలువ నిర్మాణం చేపడతామని సీఎం జగన్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. బైపాస్ కాలువ వస్తే ఈ ప్రాంతానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. రైతులకు ఉచితంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలనుకోవడం చాలా మంచి నిర్ణయమని ఆయన అన్నారు. జగన్ మహిళా పక్షపాతి అని, ప్రతి మహిళకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చి వారికి ఆర్థిక స్వావలంబన చేకూర్చారని పేర్కొన్నారు. తద్వారా మహిళల్లో ఎంతో చైతన్యం వచ్చిందన్నారు. 'నాడు-నేడు' పథకంతో స్కూళ్లకు కళ వచ్చిందని, ఇంగ్లీష్ మీడియంతో విద్యార్థుల శాతం పెరిగిందని ఆయన చెప్పారు. మహిళా సాధికారతే లక్ష్యంగా జగన్ దేశంలో ఎక్కడా లేనివిధంగా నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టారని ప్రశంసించారు. అనంతరం ఎంపీ ఆదాల దగదర్తిలో ట్రాన్స్‌ఫార్మర్లను ఉచితంగా పంపిణీ చేశారు. సిసి రోడ్డును, గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. 'గడప గడపకు ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని మహిళలకు 'జగనన్న చేయూత' చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, విజయ డెయిరీ

చైర్మన్ రంగారెడ్డి, జడ్పీటిసిలు స్వరూప, సుధాకర్‌రెడ్డిలతో పాటు స్వర్ణ వెంకయ్య, నరసింహారావు, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రావూరు సర్పంచ్‌ను పరామర్శించిన ఆదాల

నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇందుకూరుపేట మండలంలోని రావూరు సర్పంచ్ వెంకటశేషయ్యను ఇటీవల పరామర్శించారు. వెంకటశేషయ్య తండ్రి చలమయ్య ఇటీవల పరమపదించగా, వారి కుటుంబసభ్యులను పలకరించారు. చలమయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఆయన నివాళులర్పించారు.

జిల్లా అటవీశాఖ అధికారిగా చంద్రశేఖర్

జిల్లా అటవీశాఖ అధికారి (డిఎఫ్ఓ)గా ఆవుల చంద్రశేఖర్‌ను నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు తాజాగా ఉత్తర్వులిచ్చారు. అటవీశాఖ పునర్విభజన నేపథ్యంలో చిత్తూరు తూర్పు విభాగం రద్దుకావడంతో అక్కడున్న చంద్రశేఖర్‌ను నెల్లూరుకు బదిలీ చేసినట్లు సమాచారం. అటవీశాఖలో అసిస్టెంట్ కన్జర్వేటివ్ హోదా ఉన్న చంద్రశేఖర్ గతంలో టిటిడి డిఎఫ్ఓగా కూడా పనిచేశారు.

గొంతులో చేపముల్లును.. జాగ్రత్తగా తీశారు

పైసా ఖర్చు లేకుండా నయం చేశారు

పెద్దాసుపత్రి ఇఎన్‌టి వైద్యుల ఘనత

ఇఎన్‌టి వైద్యులు నవీన్ అహ్మద్ | బాధితుడు రమేష్

నెల్లూరు పెద్దాసుపత్రి వైద్యులు మానవీయతను చాటుకున్నారు. ఒక వ్యక్తి గొంతులో చేపముల్లు దిగబడి బాధతో విలవిలలాడుతూ వస్తే, ఒక్కపైసా కూడా ఖర్చు పెట్టనివ్వకుండా ఇఎన్‌టి డాక్టర్లు వైద్యం చేసి, ఆ ముల్లు తీసి నయం చేశారు. అదే ప్రైవేటు ఆసుపత్రుల్లోనైతే కనీసం 40వేలకు తగ్గకుండా ఖర్చయ్యేదని, పెద్దాసుపత్రిలో ఆ వైద్యాన్ని ఉచితంగా చేశామని ఇఎన్‌టి నిపుణులు ప్రొఫెసర్ నవీన్ అహ్మద్ చెప్పారు. నెల్లూరు దర్గామిట్టకు చెందిన రమేష్ అనే వ్యక్తికి గొంతులోపల చేపముల్లు గుచ్చుకుంది. బాధతో పెద్దాసుపత్రికి రాగా, ఎండోస్కోపి మిర్రర్‌తో బాగా పరిశీలించి చూస్తే గొంతులోపల ముల్లు కనిపించిందని, ఎంతో జాగ్రత్తగా శస్త్రచికిత్స చేసి దానిని తొలగించామని ఆయన తెలిపారు. పెద్దాసుపత్రిలో ఎంతో మంది అనుభవజ్ఞులు, ఇఎన్‌టి (చెవి, ముక్కు, గొంతు వ్యాధుల నిపుణులు) వైద్యులున్నారని, ఇలాంటి వైద్యచికిత్సలను సునాయాసంగా చేయగలరని ఆయన పేర్కొన్నారు. ఫోన్ మాట్లాడుతూ ఆహారం తీసుకోవడం వల్ల బాధితుని గొంతులో చేపముల్లు ఇరుక్కుందని, ఆహారం తీసుకునేటప్పుడు ఇలాంటివి జరగకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

'తంగిరాల మహాభారతం'

పునశ్చరణ (పార్ట్-2)

EP 12. శర్మిష్ఠ మీద అక్కసు తీర్చుకున్న దేవయాని
EP 13. యయాతి, దేవయాని శర్మిష్ఠ కథ
EP 14. యయాతి మహారాజుకి శాపం
EP 15. శకుంతల, దుష్యంతుల కథ
EP 16. శకుంతల, దుష్యంతుల కథ - 2
EP 17. గంగ - శంతనుల కథ
EP 18. అష్టవసువులుకి వశిష్ఠ మహాముని శాపం
EP 19. శంతనుడు, సత్యవతిల కథ-భీష్ముని ప్రతిజ్ఞలు
EP 20. చిత్రాంగదుడు, విచిత్రవీర్యుల కథ
EP 21. దీర్ఘతముని కథ, క్షత్రియ కన్యలకు పుత్ర సంతానం

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.

పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.

'వాత్సల్య'ను సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు

ట్రైనీ ఐఏఎస్ అధికారులు ఏడుగురు ఇటీవల నెల్లూరులోని 'వాత్సల్య' అనాథ బాలల శరణాలయాన్ని సందర్శించారు. అక్కడున్న చిన్నారులతో ముచ్చటించారు. వారితో కలసి భోజనం తిన్నారు. ఆ పిల్లలు అనేక పద్యాలు, భగవద్గీతలోని శ్లోకాలు వినిపిస్తుంటే విని ఆనందించారు. వాత్సల్య పాఠశాల, హాస్టల్‌ను సందర్శించి, శరణాలయంలోని అన్ని విభాగాలను చూసి వాటి నిర్వహణ చక్కగా ఉందంటూ అభినందించారు. తొలుత, వాత్సల్య ఆర్గనైజింగ్ సెక్రటరీ జివి సాంబశివరావు వారిని స్వాగతించి శరణాలయం తీరుతెన్నులను వారికి వివరించారు.

'నుడా' ప్రత్యేక తహశీల్దారుగా వెంకటసునీల్

నెల్లూరు కలెక్టరేట్‌లో భూముల వ్యవహారాల విభాగం తహశీల్దారుగా ఉన్న వెంకటసునీల్‌ను నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ 'నుడా' ప్రత్యేక తహశీల్దారుగా నియమిస్తూ ఇటీవల జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఉత్తర్వులు జారీచేశారు. కలెక్టరేట్ సి-సెక్షన్‌లో పనిచేస్తున్న రాఘవేంద్ర రావును కలెక్టరేట్ భూముల వ్యవహారాల విభాగానికి మార్చారు.

ఫ్రెండ్స్ వాకర్స్..'శతమానం భవతి'

నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారు ఈనెల 25న 'శతమానం భవతి' కార్యక్రమం నిర్వహించి, సెప్టెంబర్‌లో జన్మించిన 14 మంది అసోసియేషన్ సభ్యుల పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు సుబ్బారావు ఆధ్వర్యంలో కేకు కట్ చేయించి వారందరికీ కండువాలు కప్పి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. కార్యదర్శి దాసరాజు సత్యనారాయణ, కోశాధికారి రావూరి సుబ్బారావు, ఏ.చిన్నపుల్లయ్యనాయుడు, పి.ఆనందరావుల పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ కోశాధికారి నలుబోలు బలరామయ్యనాయుడుతో పాటు సభ్యులు డా.జయపాల్‌రెడ్డి, నజీర్ అహ్మద్, అబ్దుల్‌ఖాదర్, బి.మారుతిరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలకు సన్మానాలు

నెల్లూరులోని సింహపురి ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో సంస్థ నిర్వాహకులు వరలక్ష్మి, రమణయ్య నేతృత్వంలో ఈనెల 26న స్థానిక టౌన్‌హాలులో దసరా వేడుకలు జరిగాయి. పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు హాజరై పలువురు సేవా రంగ ప్రముఖులను సన్మానించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఏకొల్లు రాఘవరెడ్డి సేవలకు గుర్తింపుగా ఆయనకు విశిష్ట సేవాపురస్కారం అందజేశారు. కళ, సేవా రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న గంగవరపు రూత్‌శైలజ, ఉమామహేష్, టివి సుధారాణి, తాడికొండ మోహన్, ఎన్.వెంకటశివశార్వాణిలను సన్మానించారు. డా.శ్యాంధన్, కొట్టే వెంకటేశ్వర్లు, ప్రదీప్‌లకు సేవారత్న బిరుదులను ప్రదానం చేశారు.

నెల్లూరు కబుర్లు

లక్ష్యాల సాధనలో..

జిల్లాకు జాతీయ పురస్కారం

లక్ష్యాల సాధనలో ముందడుగు వేస్తూ జాతీయ అవార్డుకు ఎంపికైన నెల్లూరుజిల్లాకు ఈనెల 26న ఢిల్లీలో అవార్డును బహుకరించారు. జిల్లా తరపున జిల్లా కలెక్టర్‌కు కేంద్రం ఈ జాతీయ పురస్కారాన్ని ప్రకటించింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి నాగేంద్రనాథ్ సిన్హా చేతులమీదుగా జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు తరపున ఈ అవార్డును నెల్లూరు జడ్పీ సిఇఓ వాణి, జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్‌లు అందుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 28 నుంచి ఆగస్టు 15వ తేది వరకు నిర్వహించిన 'ఆజాదీ సే అంత్యోదయ తక్' కార్యక్రమంలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా నూరుశాతం లక్ష్యాలను అధిగమించి, దేశంలో ఆరవ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే.

సమస్యలను సత్వరం పరిష్కరించండి

కార్పొరేషన్ కమిషనర్ హరిత

స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరం పరిష్కరించాలని, జాప్యం చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని నెల్లూరు నగర కార్పొరేషన్ కమిషనర్ హరిత అధికారులను హెచ్చరించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఇటీవల ఆమె 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి సమస్యల అర్జీలు స్వీకరించారు. అధికారులు వెంటనే స్పందించి నిర్దేశించిన గడువు లోపలే అర్జీలను పరిష్కరించాలని ఆమె స్పష్టం చేశారు. డెప్యూటి కమిషనర్ చెన్నుడు, మేనేజర్ ఇనయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ ఆఫీస్‌లో.. దొంగలుపడ్డారు

70 వేల విలువైన కంప్యూటర్లు, పరికరాలు మాయం

నెల్లూరులోని పాత జడ్పీలోని నీటిపారుదలశాఖ కార్యాలయంలో సుమారు 70వేల విలువచేసే 3 కంప్యూటర్ మానిటర్లు, రెండు సిపియులు, రెండు స్కానర్లు, రెండు స్పీకర్లు వగైరాలు మాయమయ్యాయి. ఈనెల 25వ తేది రాత్రి ఇవి అపహరణకు గురైనట్లు తెలుసుకున్నారు. దొంగలు ఈ చోరీకి పాల్పడివుంటారని భావిస్తున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అకౌంట్స్ ఆఫీసర్ భూపయ్య ఈ విషయాన్ని చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇన్స్‌పెక్టర్ సురేంద్రబాబు, ఎస్ఐ షేక్ ఎం.డి హనీఫ్ సంఘటనాస్థలాన్ని సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'రెయిన్‌బో'లో అలరించిన..

బొమ్మలకొలువు

శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని నెల్లూరు రూరల్ పరిధిలోని కలివెలపాళెంలో ఉన్న 'రెయిన్‌బో' స్కూల్‌లో ఇటీవల ఏర్పాటుచేసిన బొమ్మలకొలువు అందరినీ అలరించింది. ఈ సందర్భంగా చిన్నారులకు పాఠశాల ఉపాధ్యాయులు విజయదశమి పర్వదినం విశిష్టతను, బొమ్మలకొలువు ప్రాధాన్యతను తెలియజేశారు. స్కూల్ డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్స్ అరుణా స్వయంప్రభ, గోపకుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ సురేఖారెడ్డి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

'కృష్ణచైతన్య' విద్యార్థికి..

రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు

--- అభినందించిన కళాశాల డైరెక్టర్లు ---

నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థి సిహెచ్ పార్థసారధి ఎన్ఎస్ఎస్ విభాగంలో జాతీయస్థాయిలో ఉత్తమ క్యాడెట్‌గా ఎంపికై ఇటీవల ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డును అందుకోవడం విశేషం. ఈ సందర్భంగా ఆ కళాశాల డైరెక్టర్లు ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు పార్థసారధిని అభినందించారు. ఈ ఏడాది జాతీయస్థాయిలో ఎన్ఎస్ఎస్ విభాగంలో 9 మంది అవార్డుకు ఎంపికకాగా, అందులో మనరాష్ట్రం నుంచి ఎన్నికైన ఏకైక విద్యార్థి తమ కళాశాల విద్యార్థి కావడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. తమ కళాశాలకు చెందిన పివి చైతన్యనారాయణ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ క్యాడెట్‌గా అదేరోజు అవార్డు పొందాడని వారు తెలిపారు. ఎన్ఎస్ఎస్‌తో పాటు ఎన్‌సిసిలో కూడా తమ విద్యార్థులు ఉత్తమంగా రాణిస్తూ రాష్ట్ర జాతీయస్థాయిలో అవార్డులు అందుకుంటున్నా రన్నారు. అదేవిధంగా విద్యలోనూ ముందుంటూ అనేక బహుళజాతి కంపెనీల్లో తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తుండడం సంతోషకర మన్నారు. ఈ ఏడాది యూనివర్శిటీ వారు విడుదల చేసిన 6వ సెమిస్టర్ ఫలితాల్లో అన్ని కోర్సులు, గ్రూపుల్లో యూనివర్శిటీస్థాయిలో కృష్ణచైతన్య విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకుంటూ ప్రథమస్థానం సాధించా రన్నారు. విద్య, క్రీడలు, సామాజిక సేవల విభాగాల్లో కృష్ణచైతన్య విద్యా సంస్థల విద్యార్థులు అగ్రగామిగా ఉండడం తమకెంతో ఆనందం కలిగిస్తోం దన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో కళాశాల డీన్ బి.సుధా రాణి, అడ్మిన్ డీన్ సి.రామాంజనేయులురెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్ నాగయ్య, వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలు గానం.. అజరామరం

• నివాళులర్పించిన కళాకారులు

ప్రఖ్యాత సినీనేపథ్య గాయకుడు, నెల్లూరు ముద్దుబిడ్డ, గానగంధర్వుడు, భారతీయ సినిమా గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గానం అజరామరమని, బాలు భౌతికంగా లేకున్నా, అందరి హృదయాల్లో శాశ్వతంగా నిలిచే ఉన్నారంటూ నెల్లూరులోని పలు కళాసంస్థలు, బాలు అభిమానులు గుర్తుచేసుకున్నారు. ఈనెల 25న బాలు ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక కళాంజలి సాంస్కృతిక సంస్థ నిర్వాహకుడు 'కళాంజలి' అనంత్, విజేత్ ఆర్ట్స్ వై.శేషగిరీశం ఆధ్వర్యంలో ఆదిత్యనగర్‌లోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ శ్రీకాంత్‌రెడ్డి, భిక్షాటనాపూర్వక త్యాగరాజ ఉత్సవాల సభ కార్యదర్శి వై.నాగదేవిప్రసాద్, విఆర్‌సి పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, రంగస్థల నటుడు బెనర్జీ, కృష్ణమోహన్, ఇందు శేఖర్ తదితరులు మాట్లాడుతూ బాలు పాటలు ఏనాటికీ మరచిపో లేనివని, ఆయన గానం చిరస్మరణీయమని అన్నారు.

అవోపా కొత్త కార్యవర్గం

ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్‌కు 2022-23 సంవత్సరానికి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నెల్లూరులోని రేబాలవారివీధిలో ఉన్న అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షునిగా నమశ్శివయ్య, ఉపాధ్యక్షులుగా కోటేశ్వరరావు, పూర్ణచంద్ర రావు, వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా సత్యేంద్రకుమార్, కోశాధికారిగా ప్రసాద్ ఎన్నికయ్యారు.

జిల్లాకు నవరాత్రుల శోభ

• కళకళలాడుతున్న అమ్మవారి ఆలయాలు

'యాదేవీ సర్వభూతేషు..శక్తిరూపేణ సంస్థితా'..అన్నట్లుగా ఈ సకల చరాచర విశ్వమంతా ఆ జగన్మాత శక్తిరూపమే. సర్వభూతాల్లో కొలువై ఉండేదీ, సర్వస్థితి రూపమంతా అవ్యక్తమైన ఆ దుర్గామాత అమ్మవారి స్వరూపమే!..ఏ పేరున తలచినా, ఏ తీరున కొలిచినా అంతా ఆ శక్తిరూపమే. అరివీర భయంకరి, సర్వ శుభంకరి కూడా అమ్మవారే. అందుకే, ఆ జగదంబ పూజలంటే భక్తులకు ప్రాణప్రదం. మహత్తరమైన దైవీశక్తిని పెంపొందించుకోవడానికి ఈ ఉత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయి కూడా. 'జగన్మాతా నమో నమ:'..అంటూ ఎంతో నియమనిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో ఈ నవరాత్రి రోజుల్లో భక్తులు, ముఖ్యంగా మహిళా భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలకు వెళ్ళి అమ్మవారిని దర్శించుకుని తరిస్తున్నారు.

నవరాత్రి ఉత్సవాలు వచ్చాయంటే భక్తులందరికీ పండుగే. ఆలయాలకు కొత్త కళ వస్తుంది. ఇంటింటా ఆనందం వెల్లి విరుస్తుంది. అమ్మవారి ఆలయాలు భక్తులతో క్రిక్కిరిసిపోతుంటాయి. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని ఆలయాలన్నీ కళకళలాడుతున్నాయి. విద్యుద్దీపాలంకరణలతో, పూల అలంకరణలతో అలరారుతున్నాయి. ప్రతినిత్యం విశేష అలంకారాలతో అమ్మవారికి విశిష్టపూజలు జరుగుతున్నాయి. ఒక్కోరోజు ఒక్కో అలంకారంతో అమ్మవారు దేదీప్యమానంగా దర్శనమిస్తున్నారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా అమ్మవారిని భవానిదేవిగా, గాయత్రి మాత, గజలక్ష్మి, అన్నపూర్ణాదేవి, త్రిపురసుందరి, కాళికాదేవి, సరస్వతిదేవి, దుర్గాదేవి, శ్రీ రాజరాజేశ్వరిదేవి, మహిషాసురమర్ధినిగా..ఇలా విశేషంగా అలంకరించి పూజలు చేయడం ప్రత్యేకించి విజయదశమి నాడు అమ్మవారికి పెద్ద ఎత్తున ఊరేగింపులు జరపడం ఆనవాయితీ. ఈ సందర్భంగా అమ్మవారికి ఖడ్గమాల పూజలు, చండీహోమాలు, సహస్రనామ పూజలు, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, నవావరణ పూజలు విశిష్టంగా జరుగుతున్నాయి. సెప్టెంబరు 26 నుంచి జిల్లాలో శరన్నవరాత్రి వేడుకలు కలశస్థాపనలతో ప్రారంభమయ్యాయి. అక్టోబరు 5వ తేది వరకు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. జిల్లాలోని జొన్నవాడ కామాక్షితాయి దేవాలయం, నరసింహకొండలోని లక్ష్మీనృసింహాలయం తదితర దేవాలయాల్లో నవరాత్రి వేడుకలు అత్యద్భుతంగా జరుగుతున్నాయి.

నెల్లూరు నగరంలో నవరాత్రి వేడుకలు :

నెల్లూరు నగరంలోని అనేక ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు అంబరాన్నంటే సంబరంగా జరుగుతున్నాయి. మూలాపేటలోని భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో అమ్మవారికి పుష్పాలంకారాలు కన్నులపండువగా నిర్వహించారు. ఆలయంలో చండీహోమం, నవావరణ పూజలు నిర్వహించారు. దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో శరన్నవరాత్రి వేడుకలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. వేలాదిమంది భక్తులు నిత్యం ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. పెద్దసంఖ్యలో భవాని మాల ధరించిన భక్తులు అమ్మవారి పూజలు, సేవల్లో తరిస్తున్నారు. ఆలయమంతా విద్యుద్దీపకాంతులతో శోభాయమానంగా ఉంది. అదే విధంగా స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలోనూ నవరాత్రి సంబరాలు మిన్నంటుతున్నాయి. కలశస్థాపన, వెండిరథంతో శోభాయాత్ర, పెన్నానది జలాలతో అమ్మవారికి విశేషాభిషేకాలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగాయి. అమ్మవారిని బంగారుచీరతో అలంకరించారు. బాలాజీనగర్‌లోని శ్రీ సీతారామస్వామి మందిరంలో అమ్మవారికి విశేష అలంకారాలు, కుంకుమపూజలు జరిగాయి. నగరంలోని అన్ని ఆలయాల్లో సర్వాంగసుందరంగా అలంకరణలు, పూజలు జరుగుతున్నాయి.

వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి..

వైభవంగా వెండి రథ సేవ

• పవిత్ర జలాలతో అభిషేకాలు

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈనెల 26వ తేది ఉత్సవాలకు కలశ స్థాపన, ప్రాణప్రతిష్ట కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా రంగనాయకులపేటలోని శ్రీ రంగనాథస్వామి ఆలయం నుండి అమ్మవారి దేవస్థానం వరకు 1008 మంది మహిళలు 1008 కలశాలతో గంగమ్మ, పెన్నమ్మ నదీ జలాలతో పెద్దఎత్తున జరిగిన ఊరేగింపు ఆకట్టుకుంది. అనంతరం ఆ పవిత్రమైన జలాలతో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి కొత్తగా రూపొందించిన వెండి రథంతో శోభాయాత్ర కార్యక్రమం కన్నులపండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆలయ గౌరవాధ్యక్షులు ముక్కాల ద్వారకనాథ్ పాల్గొని మాట్లాడారు. ఈ ఉత్సవాలకు అమ్మవారికి వెండి రథం ఉండాలనే ఆలోచనతో భక్తుల సహకారంతో 100 కేజీల వెండి రథాన్ని తయారుచేయించడం జరిగిందన్నారు. 1008 కలశాలతో పాటు వెండి రథంతో శోభాయాత్రను వైభవంగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. జిల్లాలో వెండి రథ శోభాయాత్ర జరగడం ఇదే ప్రథమమన్నారు. శరన్నవరాత్రుల్లో జరిగే ఈ ఉత్సవాల్లో భక్తులందరూ పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆయన కోరారు. ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో ఆర్యవైశ్య ప్రముఖులు సుంకు మనోహర్, అయితా రామచంద్రరావు, పబ్బిశెట్టి శ్రీనివాసులు, కోట సూర్యనారాయణ, పేర్ల సీతారామారావు, సరాబు సుబ్రహ్మణ్యం, అయితా భాస్కర్, పెంచలకుమార్, నున్నా రమేష్, గంగిశెట్టి మల్లికార్జున, కొణిజేటి వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కెఏసి ప్రిన్సిపాల్‌గా గురవయ్య

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న కెఏసి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకునిగా పని చేస్తున్న డా. కె.గురవయ్యను నియమిస్తూ ఇంటర్ బోర్డు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన ఈనెల 26న ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు.

తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

నెల్‌క్యాస్ట్‌లో రక్తదాన శిబిరం

స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు నిండిన సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడి చేపట్టిన రక్తదాన అద్భుత మహోత్సవం ఈ నెల 17 నుండి అక్టోబర్ 1వ తేదీ వరకు జరగనుంది. ఇందులో భాగంగా గూడూరు నెల్‌క్యాస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఫ్యాక్టరీ ఆవరణంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

ఈ శిబిరంలో 110 మంది సిబ్బంది రక్తదానం చేయడం జరిగిందని నెల్‌క్యాస్ట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పొన్నవోలు దీపక్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది రోడ్డు ప్రమాదాలకు గురై, సమయానికి రక్తం దొరక్క ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, అలాంటి వారిని ఆదుకునేందుకు ఇలాంటి రక్తదాన శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గూడూరు ఏరియా ఆసుపత్రి బ్లడ్‌బ్యాంకు వారు, హాస్పిటల్ సూపరింటెండెంట్ పి.రామకృష్ణారావు, బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ సందీప్ మరియు ల్యాబ్ టెక్నికల్ సిబ్బంది పర్యవేక్షణలో రక్తదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో నెల్‌క్యాస్ట్ సి.ఎఫ్.ఓ ఎస్.కె శివకుమార్, వైస్‌ప్రెసిడెంట్ ఎన్.ఎస్.రెడ్డి, ఎల్లసిరి గోపాలరెడ్డి, కంపెని ప్రతినిధులు వెంకటేశన్, దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డి, మురళీకృష్ణ, కంపెనీ పీఆర్ఓ ఆనిమెళ్ళ శివకుమార్, ఎన్.ఎస్.మూర్తి, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జెండా ఉత్సవం

గూడూరు పట్టణంలో జెండా ఉత్సవం సంప్రదాయబద్ధంగా సాగింది. కళాకారులు, యువత వివిధ వేషధారణల్లో నృత్యాలు చేస్తూ పాల్గొనడంతో పురవీధుల్లో ఎక్కడ చూసినా కోలాహలం కనిపించింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం వేకువ జాము వరకు ఆంజనేయస్వామి చిత్రాలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ట్రాక్టర్లపై ఊరేగించారు. విద్యుత్ దీపాలంకరణలు, భారీ కటౌట్లతో పట్టణం శోభాయమానంగా మెరిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

చిట్టమూరులో తెదేపా సమీక్షా సమావేశం

చిట్టమూరు మండలం, చిట్టమూరు తెదేపా కార్యాలయంలో క్లస్టర్-2 ఇన్‌ఛార్జ్ గణపర్తి కిషోర్‌నాయుడు పరిధిలోని యూనిట్ ఇన్‌ఛార్జ్, బూత్ కన్వీనర్లతో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నాయకులు చెంచురామయ్య, చిన్నారావు, సునీల్‌రెడ్డి, భారతిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కస్తూరయ్య, రాజేష్‌రెడ్డి, చెంచు రామచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, బూత్ కన్వీనర్‌లు తదితరులు పాల్గొన్నారు.

'రోటరీ వెస్ట్' పలు సరుకుల పంపిణీ

తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని రోటరీ క్లబ్ గూడూర్ వెస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఇటీవల పలసరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ ధనంజయ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నుండి వచ్చే ఎటువంటి పథకాలు పొందలేని 18 మంది నిరుపేద దివ్యాంగులకు 25 రకాల పల సరుకులను పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి దాతగా దోనేపర్తి సుబ్బారావు, సుగుణవతి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు, సూర్య ఫ్యాన్సీ అధినేత సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. వాసుగౌడ్, రాంప్రసాద్, బొమ్మిడి శ్రీనివాసులు, తాళ్లూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాలసదన్‌లో పిల్లలకు నచ్చిన భోజనం

గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నర శింగరావుపేటలోని బాలసదన్‌లోని పిల్లలకు వారు కోరిన భోజనం, స్నాక్స్, ఐస్ క్రీమ్స్, కూల్‌డ్రింక్స్ రోటేరియన్ శివకుమార్ దాతృత్వంతో అందించడం జరిగింది. క్లబ్ అధ్యక్షుడు కిరణ్ చక్రవర్తి, సీనియర్ రొటేరియన్లు బి.దశరథరామిరెడ్డి, పి.వి.కృష్ణయ్య, రవీంద్రరెడ్డి, రాంప్రసాద్, శివకుమార్, బాలసదన్ మేనేజరు అరుణ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలల్లో కొత్త కోర్సులపై.. శ్రీసిటీలో చర్చ

- పరిశ్రమల ప్రతినిధులతో రాష్ట్ర సాంకేతిక విద్యా డైరెక్టర్ సమావేశం

రాష్ట్ర సాంకేతిక విద్యా డైరెక్టర్, స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఛైర్మెన్ సి.నాగరాణి ఇటీవల శ్రీసిటీలో పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమయ్యారు. పరిశ్రమలకు అనుగుణంగా పాలిటెక్నిక్ కళాశాలల్లో కొత్త కోర్సులు, పాఠ్యాంశాల్లో మార్పులు చేర్పులకు సంబంధించి ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, రాష్ట్ర పరిశ్రమలు పెట్టుబడుల ముఖ్య సలహాదారు ఆర్.వీరారెడ్డి, సాంకేతిక విద్యాశాఖ జిల్లా అధికారులు, రాష్ట్రంలోని పలు పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పరిశ్రమ అవసరాలకు తగ్గ కోర్సులను ప్రవేశపెట్టే ప్రక్రియను వేగవంతం చేయడానికి చొరవ తీసుకున్నందుకు సాంకేతిక విద్యా డైరెక్టర్‌కు రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక కోర్సుల ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా వుందని, సాంకేతిక విద్యాశాఖ, పాలిటెక్నిక్ కళాశాలలు, పరిశ్రమలు ఏకతాటిపైకి వచ్చి సమన్వయంతో పనిచేస్తే తప్ప కొత్త కోర్సుల లక్ష్యం నెరవేరదని ఆయన తన అభిప్రాయం వ్యక్తం చేశారు. కళాశాలలు, పరిశ్రమలు, ప్రభుత్వం భాగస్వామ్యంతో కూడిన ఈ ప్రయోగం మంచి ఫలితాలను ఇచ్చేందుకు శ్రీసిటీ ఒక ఉత్ప్రేరకంలా పనిచేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. సాంకేతిక విద్యా డైరెక్టర్ నాగరాణి మాట్లాడుతూ, పరిశ్రమ అవసరాలకు సరిపోయే ప్రత్యేక కోర్స్‌ల ప్రతిపాదనపై గత నెలలో శ్రీసిటీలో జరిగిన చర్చకు కొనసాగింపుగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలు అందిస్తున్న వివిధ డిప్లొమా కోర్సులను సాంకేతిక విద్యాశాఖ అధికారి రామకృష్ణ వివరించారు. శ్రీసిటీ పరిశ్రమల ప్రతినిధులు అందుకు తమ సహాయసహకారాలను అందిస్తామన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల్లోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల ప్రిన్సిపాల్స్, సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారులు మాట్లాడుతూ, పరిశ్రమల సహకారంతో చేపట్టనున్న ఈ కొత్త ప్రయోగం విద్యార్థుల నైపుణ్యాల పెంపుకు, ఉపాధికి ఎంతో ఉపయోగపడతాయన్నారు.

శ్రీసిటీలో.. తిరుపతి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్

తిరుపతి విమానాశ్రయం డైరెక్టర్ ఎం.రాజకిషోర్ ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఇతర అధికారులతో చర్చించిన ఆయన, విమానాశ్రయంలో అందుబాటులో ఉన్న వివిధ సౌకర్యాలు, సేవలను వివరించారు. తిరుపతి విమానాశ్రయంలో మరిన్ని సేవలను పెంచాల్సిన ఆవశ్యకత, డిమాండ్ దృష్ట్యా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. శ్రీసిటీ పరిశ్రమవర్గాలు తమ ప్రయాణ అవసరాలు, కార్గో బుకింగ్‌లకు ఎయిర్‌పోర్ట్ సేవలను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. చిన్న, భారీ వస్తువులను వివిధ గమ్యస్థానాలకు త్వరితగతిలో రవాణా చేయడానికి కార్గో టెర్మినల్ వీలు కల్పిస్తుందన్నారు. శ్రీసిటీ-విమానాశ్రయం మధ్య రోడ్డు మెరుగుపడుతున్న నేపథ్యంలో ప్రయాణ అవసరాలకు కూడా తిరుపతి విమానాశ్రయాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. శ్రీసిటీని సందర్శించినందుకు ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌కి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వారికి తమ సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏపిఐఐసి తిరుపతి జోనల్ మేనేజర్ ఎస్ఎస్ సోనీ తదితరులు పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా సిద్ధార్థ లాజిస్టిక్స్ కంపెనీని రాజకిషోర్ సందర్శించి, అక్కడి అధికారులతో చర్చించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే ప్రసన్న

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం చేపట్టిన నవ రత్నాలు పథకాలు, అర్హులందరికీ సంక్షేమ పథకాలు ప్రజల ఆదరణ పొందుతున్నాయని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు మండలంలోని పోతిరెడ్డిపాళెంలో మంగళవారం ఆయన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించి, ప్రజలను కలసి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన కనిపించింది.

గంజాయి ముఠా.. దొరికిపోయింది

- ఆరుగుర్ని అరెస్టు చేసిన సెబ్ అధికారులు
- 5 లక్షల విలువచేసే గంజాయి స్వాధీనం

నెల్లూరులో చాటుమాటుగా గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఆరుగురు సభ్యులున్న ముఠాను సెబ్ నెల్లూరు-1, జేడీ టీమ్ అధికారులు ఈనెల 27న చాకచక్యంగా అరెస్టు చేశారు. నిందితుల నుంచి సుమారు 5 లక్షల విలువైన 63 కిలోల గంజాయిని, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు సెబ్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో సెబ్ ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ ఆ వివరాలను వెల్లడించారు. స్థానిక కపాడిపాళెంలో ఉన్న వాదనాల హైమవతి ఇంట్లో గంజాయి ఉందన్న సమాచారంతో నెల్లూరు-1 సెబ్ ఇన్స్‌పెక్టర్ కేపి కిషోర్, జేడీ టీమ్ ఎస్ఐ బాలకృష్ణ దాడిచేసి అక్కడున్న గంజాయి పొట్లాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులైన హైమవతి, ముంతాజ్, సత్తార్‌లను స్టేషన్‌కు తరలించి విచారించగా కోటమిట్టకు చెందిన ఎం.డి ఫర్దీన్ గంజాయి విక్రయించినట్లు చెప్పడంతో ఆయనింటిపై దాడిచేసి 10 కిలోల గంజాయిని పట్టుకున్నామన్నారు. ఆ తర్వాత విచారణలో తెలిసిన బాలాజీనగర్‌లోని మొయిన్‌అహ్మద్ ఇంట్లో దాడిచేయగా అక్కడ 23 కిలోల గంజాయి దొరికిందని, ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న నాయుడుపేటకు చెందిన మనోహర్‌ను కూడా అదుపులోకి తీసుకున్నామని ఆయన వివరించారు. తీగ లాగితే డొంకంతా కదిలినట్లు చివరికి నర్సీపట్నంకు చెందిన దారా బాబు వీరికి గంజాయి విక్రయించినట్లు తేలడంతో ఆ వ్యక్తిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని ఆయన చెప్పారు.

శ్రీ దుర్గాభవాని దీక్షాపీఠం ఆధ్వర్యంలో

అమ్మవారి శరన్నవరాత్రి వేడుకలు

నెల్లూరు శివార్లలోని వైఎస్సార్‌నగర్ 2వ వీధిలో శ్రీ దుర్గాభవాని దీక్షా పీఠం ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. దీక్షాపీఠం నిర్వాహకులు తిరుపతి గురుస్వామి ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించి కలశస్థాపన చేశారు. అక్టోబరు 6వ తేది వరకు ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని, ఈనెల 29వ తేది మధ్యాహ్నం అన్నపూర్ణాదేవి అలంకారం సందర్భంగా అన్నప్రసాద వితరణ చేశామని, వచ్చేనెల 5న శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారం నాడు జమ్మిచెట్టు పూజ, అనంతరం 6న అమ్మవారి విగ్రహమూర్తి ఊరేగింపు కన్నులపండువగా ఉంటాయని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

సమస్యలపై గళమెత్తిన 'ఐద్వా' సభలు

నెల్లూరులో ఇటీవల మూడురోజుల పాటు జరిగిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా)15వ మహాసభల్లో నాయకురాళ్ళు దేశవ్యాప్తంగా ఉన్న పలురకాల సమస్యలపై గళమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నాయంటూ ధ్వజమెత్తారు. 'ఐద్వా' జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే తదితర ముఖ్య నాయకురాళ్లు పాల్గొన్న ఈ సభలు నగరంలోని జెట్టి శేషారెడ్డి భవన్‌లో పెద్దఎత్తున జరిగాయి. అధికధరలను అరికట్టాలని, ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని, మద్యం, మాదక ద్రవ్యాలను అరికట్టాలని ఈ సభల్లో తీర్మానాలు చేశారు. ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తోందని, ఒకవైపు ధరలు భారీగా పెరుగుతూ పేదల బతుకులు అస్తవ్యస్తమైపోతుంటే, ఉపాధి కూలీలకు వేతనాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని విమర్శించారు. దేశంలో మతం పేరుతో దాడులు పెరిగిపోతున్నాయని, మహిళల మీద అఘాయిత్యాలు పెరిగిపోతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, మహిళా చట్టాల అమలులో గొప్పలు చెప్పుకోవడమే తప్ప ఆచరణ అంతా నామమాత్రంగానే ఉందన్నారు. మహిళా లోకానికి ఐద్వా అండగా ఉంటూ సమస్యల సాధనకు ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. ఐద్వా జాతీయ నాయకురాళ్ళు పుణ్యవతి, సావిత్రి, ప్రియాంక, ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 350 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

కరుణామయి.. జగన్మాత దుర్గాంబ

లోకాలను పాలించే సర్వశక్తి స్వరూపిణి అయిన ఆ జగన్మాత దుర్గాంబా దేవి కరుణామయి అని, భక్తుల పాలిట కల్పవల్లిగా విరాజిల్లుతున్న ఆ శక్తిస్వరూపిణిని ఈ నవరాత్రుల్లో పూజించుకుంటే సకల శుభాలు కలుగుతాయని ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ అన్నారు. ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామంలో శివకేశవుల అభేదానికి ప్రతీకగా కొలువైవున్న శ్రీ కామాక్షీదేవి సమేత రామేశ్వర-వేణుగోపాలస్వామి దేవస్థానంలో జరుగుతున్న నవరాత్రి వేడుకల్లో ఆయన ఆధ్యాత్మికోపన్యాసం చేసి భక్తులకు శరన్నవరాత్రుల ప్రాశస్త్యాన్ని, అమ్మవారి వైభవాన్ని, మహిషాసురమర్ధని ఆవిర్భావ ఘట్టాన్ని వివరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఇక్కడ జరుగుతున్న ధార్మికోపన్యాసాల్లో ఆయన మూడురోజుల పాటు పాల్గొని విజయదశమి విశేషాలను, జగద్గురు ఆదిశంకరాచార్యుల వారు రచించిన మీనాక్షి పంచరత్న స్తోత్రంలోని విశిష్టతలను, వారు ప్రబోధించిన శరణాగతి తత్వాన్ని భక్తులకు సరళమైన రీతిలో వివరించారు. అనంతరం గ్రామపెద్దలు, ఆలయ ప్రముఖులు నువ్వూరు బ్రహ్మయ్య, పొట్టేపాళెం బాబు, నందం శ్రీనివాసులు, మిడుతూరు మనోజ్ కుమార్, జి.ప్రభాకర్, ఆత్మకూరు మాధవి తదితరులు రాజశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. పదేళ్ళ క్రితం ఈ ఆలయాన్ని పునర్నిర్మించిన ఆలయ నిర్మాణకర్తలు దువ్వూరు మధు సూదన్‌రెడ్డి, విజయలక్ష్మి, దువ్వూరు శివకుమార్‌రెడ్డి-మమత దంపతుల నేతృత్వంలో శరన్నవరాత్రి వేడుకలు ఆలయ సముదాయంలో ఘనంగా జరుగుతున్నాయి.

అపోలో ఆసుపత్రిలో..

విజయవంతంగా రోబోటిక్ సర్జరీలు

అపోలో వైద్యశాలలో మోకాలి కీలు, తుంటి మార్పిడులలో రోబోటిక్ విధానం ద్వారా విజయవంతంగా ఆపరేషన్లు చేస్తున్నామని, ఇప్పటిదాకా సుమారు 1500 ఆపరేషన్లు నిర్వహించామని, ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాంకేతికతతో కూడిన ఈ రోబోటిక్ సర్జరీలు వైద్యరంగంలో విప్లవాత్మకంగా మారాయని చెన్నై అపోలో ఆసుపత్రి సీనియర్ వైద్యులు, సీనియర్ ఆర్థో కన్సెల్టెంట్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. నెల్లూరులోని అపోలో ఆసుపత్రి వైద్యులు, డాక్టర్ వివేకానందరెడ్డి, డాక్టర్ కార్తీక్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీరామ్ సతీష్‌లతో కలసి ఆయన ఈనెల 25న నెల్లూరులోని చిల్డ్రన్స్‌పార్కు వద్ద ఉన్న అపోలో ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అత్యాధునికమైన ఈ రోబోటిక్ సర్జరీలు బాధితులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయని, ఎముకల్లో ఉన్న లోపాలు కూడా దీనివల్ల తెలుస్తాయని, ఈ ఆపరేషన్లు ఎంతో సురక్షితమని తెలిపారు. ఆసుపత్రి సదరన్ రీజియన్ వైస్‌ప్రెసిడెంట్ నవీన్, ఆర్థోపెడిక్ ఎం.డి డాక్టర్ పృథ్వీరెడ్డి, డాక్టర్ శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదం ఎంతో మంచిది

ఆరోగ్యానికి ఆయుర్వేదం ఎంతో మంచిదని, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు లేకుండా అనేక రకాల జబ్బులను ఆయుర్వేదం నయం చేస్తుందని ఆయుష్ సంస్థ సీనియర్ మెడికల్ ఆఫీసర్ గోవిందయ్య చెప్పారు. ఇటీవల నెల్లూరు, అయ్యప్పగుడి సెంటర్ సమీపంలోని జ్యోతినగర్ 8వ వీధిలో పరివార్ సేవా ఫౌండేషన్ ద్వారా ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలాపేటలో ఉన్న ఆయుష్ వైద్యశాలలో పంచకర్మ చికిత్సలను ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. అనంతరం రోగులను పరీక్షించి వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. పొదుపు సంఘాల నాయకురాళ్ళు ధనలక్ష్మి, ఇందుమతి, డాక్టర్లు మాధవరావు, గీత, ఆయుష్ సిబ్బంది సందీప్, మల్లయ్య, సుకన్య, పరివార్ సేవా ఫౌండేషన్ అధ్యక్షురాలు మాధవి పాల్గొన్నారు.

సహకార ఉద్యోగుల

కష్టాలు తీర్చండి

రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పిఏసిఎస్)లలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎంతోకాలంగా సమస్యల సుడిలో కొట్టుమిట్టాడుతున్నారని, సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని పిఏసిఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు హరనాథరెడ్డి చెప్పారు. నెల్లూరు నగరంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఇటీవల జరిగిన ఆ సంఘం రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం కృషిచేస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు దీర్ఘ కాలంగా ఎన్నో సమస్యల్లో ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. పిఏసిఎస్ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలుచేయాలని, జీతభత్యాలను ఖరారుచేసిన తర్వాతే సిఇఓల బదిలీల ప్రక్రియ చేపట్టాలని, సహకార ఉద్యోగులు ఉద్యోగ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని ఆయన కోరారు. జిల్లా కోఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, పిఏసిఎస్ ఉద్యోగుల జిల్లా సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగరాజు, రామానాయుడు, గౌరవాధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి పిఏసిఎస్ ఉద్యోగులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

టూకీగా...

నవరాత్రులకు భారీ బందోబస్తు

శరన్నవరాత్రుల సందర్భంగా నెల్లూరు దర్గామిట్టలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయానికి పెద్దఎత్తున భక్తులు తరలివస్తుండడంతో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర డిఎస్పీ పర్యవేక్షణలో పెద్దసంఖ్యలో పోలీసులు ఆలయం ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నారు.

గంగమ్మతల్లికి పొంగళ్ళు

చేజర్లలో గ్రామదేవత గంగమ్మ జాతరను పురస్కరించుకుని ఇటీవల గ్రామస్తులు పెద్దఎత్తున అమ్మవారికి పొంగళ్ళు వండి, నైవేద్యంగా సమర్పించారు. సకాలంలో వానలు కురవాలని, పాడిపంటలతో ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా అనేకగ్రామల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయప్రాంతమంతా క్రిక్కిరిసిపోయింది.

పారిశుద్ధ్యకార్మికులకు సన్మానం

అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు స్థానిక కెఎస్ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ కందల రాజారెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల సన్మానాలు చేశారు. కందల శివరామిరెడ్డి వర్ధంతి సందర్భంగా అల్లూరు, మోపూరు, సింగపేటలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను వారు సన్మానించారు. రామకృష్ణ కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

గుట్కాలు అమ్మితే కఠినచర్యలు

గుట్కాలు అమ్మారో.. కఠిన చర్యలు తప్పవంటూ కొండాపురం ఎస్ఐ ఎస్కెఖాజావలి హెచ్చరించారు. గతంలో గుట్కాలు అమ్ముతున్నవారిని స్టేషన్‌కు పిలిపించి ఇటీవల కౌన్సిలింగ్ ఇచ్చారు. గుట్కాలు అమ్మినట్లు తెలిస్తే కేసులు పెడతామని, జైలు తప్పదని, గుట్కాలు, మత్తుపదార్థాలు, నిషేధిత వస్తువుల జోలికిపోకుండా జాగ్రత్తగా మసలుకోవాలని వార్నింగ్ ఇచ్చారు.

పేదబ్రాహ్మణులకు చేయూత

మహాలయ అమావాస్య సందర్భంగా ఈనెల 25న ఆత్మకూరు మునిసిపాలిటీ పరిధిలో ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయ ధర్మకర్త ఏటూరి సుధాకర్‌రెడ్డి సతీమణి తీర్థకుమారి దాతృత్వంతో 30మంది పేదబ్రాహ్మణులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఏటూరి కుటుంబసభ్యులతో పాటు ఆలయ అర్చకులు కృష్ణమూర్తిశర్మ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఎంతో ముఖ్యమని నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కొండయ్య విద్యార్థులకు సూచించారు. జాతీయ సేవా దినోత్సవం సందర్భంగా ఈనెల 24 ఎన్ఎస్ఎస్ విభాగం వారు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విజయకుమార్, నాగబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అనధికార కళాశాలలకు నోటీసులు

నెల్లూరు నగరంలో నిబంధనలకు విరుద్ధంగా, అనుమతుల్లేకుండానే ప్రైవేట్‌గా జూనియర్ కాలేజీలు నిర్వహిస్తున్నవారికి ఆర్ఐఓ వరప్రసాద్‌రావు ఇటీవల నోటీసులు జారీచేశారు. స్టోన్‌హౌస్‌పేట, ధనలక్ష్మీపురం, ఇస్కాన్‌సిటీ ప్రాంతాల్లో అనధికారికంగా ఉన్న కళాశాలల యాజమాన్యాలకు నోటీసులిచ్చారు.

సీసీ కెమెరాలు పెట్టుకోండి

ముత్తుకూరులో ఉన్న వ్యాపారస్తులు తప్పనిసరిగా దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని, దొంగతనాలను అరికట్టేందుకు అందరూ సహకరించాలని ముత్తుకూరు ఎస్ఐ శివకృష్ణారెడ్డి సూచించారు. ఇటీవల ఆయన దుకాణాలను పరిశీలించి వ్యాపారులకు, ప్రజలకు తగు సూచనలిచ్చారు.

షాదీమంజిల్‌ను బాగుచేయించాలి

కోవూరు మండలం పడుగుపాడులో షాదీమంజిల్‌కు మరమ్మతులు చేయించి పున:ప్రారంభించాలని జనసేన నాయకులు ఇటీవల కోవూరులో ఆందోళన చేశారు. సిహెచ్ శ్రీనివాసరెడ్డి, అల్తాఫ్, మున్వర్, తన్మయ్, సాయి, మురళి పాల్గొన్నారు.

తెలుగుభాషకు జాషువా సేవలు అపారం

కలెక్టర్ నివాళి

ప్రముఖ కవి గుర్రం జాషువా తెలుగుభాషకు చేసిన సేవలు అపారమని, తెలుగు కవిత్వాన్ని అంతర్జాతీయస్థాయికి తీసుకువెళ్ళిన మహనీయులాయన అని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు కొనియాడారు. ఈనెల 28న నెల్లూరులోని జాషువా కవితాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన జాషువా జయంత్యుత్సవాల్లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. తెలుగు సాహిత్యం, తెలుగు భాష ఉన్నంతవరకు ఆయన రచనలు నిలిచే ఉంటాయన్నారు. తొలుత జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కొమ్మల కృష్ణయ్య, బద్దెపూడి శేనయ్య, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులందజేశారు.

గజలక్ష్మీదేవిగా.. ఇరుకళల పరమేశ్వరి

సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఈనెల 28న అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అభిషేక సేవ, పూలంగిసేవ, పల్లకిసేవలను కన్నులపండువగా నిర్వహించారు. అమ్మవారు గజలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మెన్ రావు శ్రీనివాస రావు, ఇఓ పెంచల వరప్రసాద్, ఆలయ కమిటీసభ్యుల పర్యవేక్షణలో నవరాత్రి వేడుకలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి.

రైతు నుంచి లంచం తీసుకుంటూ

ఏసిబి వలకు చిక్కిన.. సీతారామపురం తహశీల్దార్

ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ నెల్లూరుజిల్లా సీతారామపురం తహశీల్దారు కాయల సతీష్ ఈనెల 28న ఏసిబి అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారు. వివరాలిలా ఉన్నాయి. సీతారామపురం మండలంలోని అయ్యవారిపల్లి ప్రాంతానికి చెందిన బొబ్బా అంకయ్య అనే రైతు తన భూమి మ్యుటేషన్ కోసం తహశీల్దారును సంప్రదించగా తహశీల్దారు ఆ రైతు నుంచి లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. 10వేలు ఇవ్వాలని తహశీల్దారు అడగ్గా, లంచం ఇచ్చేందుకు ఇష్టంలేని ఆ రైతు ఏసిబి అధికారులను ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో ఆ నగదును సీతారామపురంలో తహశీల్దారు ఇంట్లోనే ఇస్తుండగా ఏసిబి అధికారులు వల పన్ని పట్టుకున్నారు. అనంతరం తహశీల్దారు కార్యాలయానికి తీసుకువెళ్ళి విచారించారు. ఈ దాడుల్లో ఏసిబి డిఎస్పీ జిఆర్ఆర్ మోహన్, సిఐలు రమేష్‌బాబు, శ్రీనివాస్, వేణు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విఎస్‌యులో జాషువా జయంతి

నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఈనెల 28న ప్రముఖ కవి గుర్రం జాషువా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. విఎస్‌యు ప్రిన్సిపాల్ ఆచార్య విజయానందకుమార్ పాల్గొని జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాషువా రచనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుశాఖ అధ్యాపకులు డా.సి.రాజారావు, డా.కె.లక్ష్మీనారాయణరెడ్డి, డా.వి.వెంకటేశ్వర్లుతో పాటు ఆచార్య ఎం.త్యాగరాజు, డా.జి.సునీల్‌కుమార్, డా.వి.గోవిందు, డా.ఎన్ గురవయ్య, డా.బి.ప్రభాకర్‌రావు, ఏ.ప్రవీణ్, డా.ఎం.ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ సిఇఓగా

బాధ్యతలు చేపట్టిన చిరంజీవి

నెల్లూరు జిల్లా పరిషత్‌లో డెప్యూటి సిఇఓగా ఉన్న చిరంజీవికి సిఇఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఆయన ఈనెల 28న సిఇఓగా బాధ్యతలు చేపట్టారు.

సామాజిక అటవీ విభాగానికి

కొత్త డిఎఫ్ఓ

జిల్లా సామాజిక అటవీ విభాగానికి కొత్త డిఎఫ్ఓ నియమితులయ్యారు. ఏలూరులో విధులు నిర్వహిస్తున్న జి. శ్రీనివాసులును నెల్లూరులో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీంతో, నగరంలోని సామాజిక అటవీ క్షేత్ర కార్యాలయంలో ఆయన ఈనెల 28న డిఎఫ్ఓగా బాధ్యతలు స్వీకరించారు.

ఆర్చరీ జిల్లా జట్ల

ఎంపికలు.. 2న

ఆర్చరీ(విలు విద్య) పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్లను అక్టోబర్ 2వ తేదిన ఎంపిక చేయనున్నామని, ఆసక్తి కలవారు ఆరోజు ఉదయం 8.30 గంటలకు నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు తగు ధృవీకరణ పత్రాలతో రావాలని జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, వేణు కోరారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 17 నుంచి 19వ తేది వరకు పార్వతీపురంలో జరిగే 42వ రాష్ట్రస్థాయి జూనియర్ ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు 94419 55334 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

టిప్పర్ ఢీకొని

అంగన్‌వాడీ వర్కర్ కన్నుమూత

మర్రిపాడు మండలకేంద్రంలోని ఓ అంగన్‌వాడీ కార్యకర్త ఈనెల 28న రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. ఏపిలగుంట-మర్రిపాడు రహదారిపై ఇసుక తరలిస్తున్న టిప్పర్ ఢీకొనడంతో గాయపడిన ఆమె చికిత్స పొందుతూ మరణించింది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. మర్రిపాడుకు చెందిన కన్నెలూరి రత్నమ్మ (48) అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తోంది. బుధవారం ఆమె కేంద్రానికి వెళ్ళి తిరిగి రోడ్డుపై నడచి వెళ్తుండగా వెనుకనుంచి వేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. తీవ్ర గాయాలతో ఉన్న ఆమెను వెంటనే నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. మర్రిపాడు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరోసారి జగన్ ఝలక్

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలతో సీఎం ప్రత్యేక సమావేశం నిర్వహించి రానున్న ఎన్నికల్లో విజయానికి బాటలు ఎలా వేసుకోవాలో దిశానిర్దేశం చేశారు. గతంలో తాము చెప్పిన ఈ మాటల్ని మరోసారి ఈ సందర్భంగా ఏకరువు పెట్టారు. ఎన్నికలిక కేవలం 19 నెలల్లోనే ఉంటాయని గుర్తుచేశారు. ప్రజలకు మంచి చేశాం. ఇంకా చేస్తున్నాం. అవన్నీ ప్రజలకు చెప్పండి.. అని ఆయన వారికి నిర్దేశించారు. ప్రజలతో సన్నిహితంగా ఉంటూ, వారి సమస్యలు విని తీర్చాలే తప్ప, మీకు బదులుగా మీ బంధువుల్నో, వారసుల్నో వారి వద్దకు పంపి సరిపెట్టుకోవడం సరికాదని స్పష్టం చేశారు. సరిగ్గా పనిచేయనివారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించడం జరగదన్నారు. ఇప్పటికే కొంతమంది ఎమ్మెల్యేలు, మంత్రులు, రీజనల్ కో-ఆర్డినేటర్ల పనితీరు బాగా లేదంటూ సిఎం మండిపడ్డారు. ఇదీ తాడేపల్లి నుండి వస్తున్న సమాచారం. అయితే, ఈ సందర్భంగా ఆయన ఉటంకించిన కొన్ని పేర్లు అందరినీ ఆశ్చర్యపరచాయంటున్నాయి తాడేపల్లి వర్గాలు. అసలు 'గడప గడపకు మన ప్రభుత్వం' అన్న నినాదాన్ని రాష్ట్రంలో మొట్టమొదటిగా వినిపించిందీ, ఆచరించిందీ కూడా నెల్లూరు రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డే. అలాంటిది పూర్ పెర్ఫార్మెన్స్ చిట్టాలో ముఖ్యమంత్రి... శ్రీధర్ పేరు చదవడం పలువురిని విస్మయానికి గురిచేసిందంటున్నారు విశ్లేషకులు.

నిజంగా సొంత సర్వేనేనా...?

అసలు ముఖ్యమంత్రి నిజంగా సొంత సర్వే చేశారా లేక మళ్ళీ చెప్పుడు మాటలు విని తప్పులో కాలేస్తున్నారా..? అన్న అనుమానం సొంత పార్టీ నేతలనుండే వినపడుతోంది. 175కి 175 లక్ష్యంగా ముందుకు సాగాలని పదేపదే దిశా నిర్దేశం చేస్తున్న తమ నేత ఎవరి రిపోర్టును ప్రామాణికంగా తీసుకుని తమ పనితీరును అంచనా వేస్తున్నారో అర్థం కావడంలేదని పలువురు శాసనసభ్యులు , పార్టీ నాయకులు మాట్లాడుకోవడం ఇప్పుడు రాష్ట్రంలో చర్చనీయాంశమైంది. తమ నియోజకవర్గాలను గాలికి వదిలేసి మహానగరాలలో వ్యాపారాలు చేసుకుంటూ, చతుర్ముఖ పారాయణంతో కాలక్షేపం చేసుకుంటూ ఉన్న చాలామంది పేర్లు సీఎం ప్రస్తావించకపోవడం... తమ నాయకుడు కూడా పక్షపాత ధోరణి ప్రదర్శిస్తున్నారా...? లేక ఎవరైనా ఆయనను తప్పుదోవ పట్టిస్తున్నారా? అని పార్టీ నాయకులు వాపోతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా ఎన్నికలు ఎప్పుడైనా రావొచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్న తరుణంలో, ఇలా అప్పుడప్పుడూ పార్టీ వర్గాలను పిలిచి ఇలా జగన్ ఝలక్ ఇవ్వడంతో ఈ పార్టీలో తమ భవిష్యత్ ఏమిటో అర్థంకాక పలువురు నేతలు తలపట్టుకుంటున్నారని అంటున్నారు తలపండిన రాజకీయ నేతలు. ఒకప్పుడు సీనియర్లను పార్టీ నుండి తరిమేయడానికి పొగపెట్టిన నయా నాయకులు ఇప్పుడు తమ గతేం కాబోతుందో అర్థం కాక కుయ్యో మొర్రో అంటున్నారని చెప్తున్నారు. రాజకీయాలలో ఏ క్షణం ఏమైనా జరగొచ్చు... చూద్దాం ఏం జరుగుతుందో..!

ఆరోగ్యవంతమైన జీవన విధానంతో..

గుండె జబ్బులు దూరం

మెడికవర్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

ఆరోగ్యవంతమైన జీవన విధానంతో..గుండె జబ్బులు దూరం చేసుకోవచ్చని ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని మెడికవర్ హాస్పిటల్ వారు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈనెల 29వ తేది గురువారం నాడు హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్ నాగిరెడ్డి సారధ్యంలో, సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ విజయ్ అమర్‌నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మెడికవర్ సిబ్బంది "మినీ వాకథాన్"ను నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యులు, సిబ్బంది... గుండె సంరక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రజలకు వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. మెడికవర్ హాస్పిటల్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ చిల్డ్రన్స్ పార్క్ వరకూ, అక్కడి నుండి తిరిగి హాస్పిటల్ వరకూ సాగింది. వైద్యులు, సిబ్బంది ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజలకు గుండె సంరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రపంచ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని 550 రూపాయలకే గుండెకు సంబంధించిన అన్ని పరీక్షలు చేసే ప్రత్యేక ప్యాకేజీని సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్ నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని గుండె వ్యాధుల అనుమానాలను నివృత్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానం ఒత్తిళ్లతో కూడుకుందని, తగినంత నిద్ర లేకపోవడం, చిన్న చిన్న ఆరోగ్య సమస్యలతో, ఒత్తిడితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఒత్తిడికి దూరంగా ఉంటూ మనసును ప్రశాంతంగా ఉంచితే గుండెకు ఎలాంటి సమస్యలు రావని పేర్కొన్నారు. మెడికవర్ సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ విజయ్ అమర్‌నాథ్‌రెడ్డి, హాస్పిటల్ కార్డియాలజీ విభాగం వైద్యులు డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ లోకేశ్వరరావు, డాక్టర్ త్రిలోక్, డాక్టర్ జైరాం, హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ రఘు, ఆపరేషన్ హెడ్ జగదీష్, రీజనల్ మార్కెటింగ్ మేనేజర్ ఉదయభాస్కర్, మార్కెటింగ్ మేనేజర్ మధు, శ్రీనివాసరావు, పిఆర్ఓ చందువర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటికీ 175 కి 175 పైనే ఉన్నారా!?

ఆంధ్రప్రదేశ్‌లో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలోని ప్రభుత్వం ఇప్పుడు నాలుగో ఏట నడుస్తోంది. ఈ ఏడాది గడిస్తే, ఇక అసెంబ్లీ ఎన్నికల కోలాహలమే. వచ్చే ఎన్నికల్లో 175కి 175 అసెంబ్లీ స్థానాలను వైయస్సార్సీపీ గెలవాలనే పట్టుదలతో ఉన్నారు. ఆయన డిసైడ్ అయితే... ఇక చెప్పేది ఏముంది? అప్పుడే ఈ దిశగా ప్రయత్నాలు ప్రారంభించినట్టుగా కూడా ఆయన కనపడుతున్నారు. మొదటి మూడేళ్లలో క్యాంప్ ఆఫీస్‌కే ఎక్కువగా పరిమితం అయ్యారనే విమర్శలు ఎదుర్కొన్న జగన్, ఇప్పుడు నాలుగో ఏట రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళుతున్నారు. సంక్షేమ నగదు బదిలీలకు ఇన్నాళ్ళూ క్యాంపు ఆఫీస్ నుంచే బటన్ నొక్కిన జగన్, ఇప్పుడు బటన్ నొక్కడం కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళుతున్నారు. లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి ఆటోమాటిక్‌గా నగదు బదిలీ చేస్తున్నారు.

ఎంఎల్ఏలు, మంత్రులు, ఇతర ముఖ్యనేతలతో క్యాంపు ఆఫీస్‌లో సమావేశాల నిర్వహణ ప్రారంభించారు. నియోజకవర్గాల్లోని కార్యకర్తలను కూడా క్యాంపు కార్యాలయానికి ఆహ్వానిస్తున్నారు. మొన్నీమధ్య కుప్పం నియోజకవర్గానికి చెందిన ఓ యాభై మంది స్థానిక వైసీపీ నేతలను క్యాంపు కార్యాలయానికి ఆహ్వానించారు. కుప్పం కూడా తన సొంత నియోజకవర్గం లాంటిదే అన్నారు. కార్యకర్తలతో నేరుగా మాట్లాడడం ఓ మంచి ఆలోచనే. ఎం.ఎల్.ఏలు, ఎం.పీలు, మంత్రులు అయితే ప్రజలకు అందుబాటులో ఉండరు గానీ, కార్యకర్తలు అలా కాదు కదా! వారు ప్రజల్లో తిరుగుతారు. జగన్ నడుపుతున్న ప్రభుత్వం గురించి ప్రజలు ఏమి అనుకుంటున్నారో... పార్టీ కార్యకర్తలకు తెలుస్తుంది.

నిజానికి, రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గమూ తన నియోజకవర్గమే అని ముఖ్యమంత్రి అనుకోవాలని ప్రతి నియోజకవర్గంలోని వైసీపీ కార్యకర్తలు, నేతలు భావిస్తున్నారు. కుప్పంలాగా, 175 నియోజకవర్గాల కార్యకర్తలతో ఆయన సమావేశం కావాల్సిన అవసరం ఉంది.

వాలంటీర్లతోనూ సమావేశం కావచ్చు. రేపొద్దున్న ఇంటింటికీ తిరిగి, జగన్ 'సందేశాన్ని' పంచాల్సింది వారే కదా! వారికి ప్రభుత్వ సొమ్మునే పారితోషికంగా ఇస్తున్నప్పటికీ, వారూ పార్టీ కార్యకర్తలే అని విజయసాయిరెడ్డి ఎప్పుడో చెప్పారు కూడా.

భూ భారాన్ని ఆదిశేషుడు ఒక్కడే మోస్తున్నట్టు, వైసీపీ పార్టీ భారాన్నే గాక, 2019లో మొత్తం వైసీపీ ఎన్నికల భారాన్ని కూడా జగన్ ఒక్కరే మోశారు. అందుకే, ఎన్నికల భారతంలో కనీవినీ ఎరుగని రీతిలో 175 స్థానాలకు 151 స్థానాలను చేజిక్కించుకున్నారు. ఇందుకు నూరు శాతం క్రెడిట్ జగన్‌మోహన్‌రెడ్డిదే.

అప్పుడు ఎంఎల్ఏ అభ్యర్థులుగా పోటీచేసిన వారిలో చాలామంది పేర్లు కూడా... ఆయా నియోజకవర్గాలలో పెద్దగా తెలియదు. అయినా, వారంతా గెలిచి కూర్చున్నారు. కేవలం 24 మందే వారి దురదృష్టవశాత్తు గెలవలేకపోయారు. ఇప్పుడూ వచ్చే ఎన్నికల సమస్త భారాన్నీ ఆయనే మోయాలని వైయస్సార్సీపీ శ్రేణులు యావత్తూ భావిస్తున్నాయి.

జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని అనుకుంటే, ఎంఎల్ఏలను ఆయనే గెలిపించుకోవాలని, తాము గెలవడం అనేది... తమకంటే ఆయనకే ఎక్కువ ముఖ్యమని కూడా కొందరు ఎం.ఎల్.ఏలు భరోసాతో ఉన్నట్టు వినికిడి.

పాదయాత్ర సమయంలోనే కాదు... ఈ ప్రభుత్వానికి జగన్ సారధ్యం ప్రారంభమైన తరువాత కూడా జగన్ వైపే జనం ఆశగా చూస్తూ వచ్చారు. కక్ష కట్టి మరీ టీడీపీని ఓడించి, జగన్‌ను గెలిపించికున్నందున, 'మనందరి ప్రభుత్వం' అని ప్రతి సభలోనూ ఆయన పదే పదే చెప్పినందున జగన్ ప్రభుత్వంపై ప్రజలు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ఎంఎల్ఏలు, మంత్రులు ఎవరనే విషయం కూడా వారు పట్టించుకోలేదు.

వైయస్సార్సీపీ నేతృత్వంలోని ప్రభుత్వ యంత్రాంగ నిర్వహణకు కర్త, కర్మ, క్రియ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, మంచీ -చెడూ అన్నీ జగనే అన్న భావం జనంలో బాగా స్థిరపడిపోయింది.

ఈ నేపథ్యంలో జగన్ ఇప్పుడు మరోసారి రాజకీయంగా క్రియాశీలకం అవుతున్నారనే వాతావరణం కనిపిస్తోంది. ఎందుకంటే... వచ్చే ఎన్నికల్లో వైయస్సార్సీపీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చే భారం నూటికి నూరు శాతం తనదే అనే విషయం ఆయనకూ తెలుసు గనుక. ఇందులో ఎవరికీ అనుమానం లేదు, క్రెడిట్‌లో వాటా కూడా లేదు.

ఆయన తప్ప, మిగిలిన వారు నిమిత్తమాత్రులు. మిగిలిన వారంతా ఆయన విజయం సాధిస్తే... పదవులు, అధికారమూ అనుభవించడానికే తప్ప, పార్టీని గెలిపించడానికి పనికిరారు. నెల్లూరు స్టేషన్‌లో రైలు ఎక్కి, బిట్రగుంట స్టేషన్‌లో దిగిపోయే ప్రయాణికుల్లాంటి వారు.

ఇక , 2019లో గెలవడం అయితే గెలిచారు కానీ, ప్రభుత్వ నిర్వహణ అనేది ఓట్లేసి గెలిపించిన ప్రజలు ఆశించిన స్థాయిలో లేదనేది బహిరంగ రహస్యం. 'ఎందుకు' లేదు అనేది కూడా బహిరంగ రహస్యమే.

వైయస్సార్సీపీ వేసుకోవాల్సిన ఒక ప్రాధమిక ప్రశ్న ఏంటంటే... సమాజంలోని ప్రాంతాలు, కులాలు, మతాలు, వర్గాలకు అతీతంగా.... ప్రజలంతా రాత్రి పన్నెండు గంటలవరకు క్యూలైన్లలో నిలబడి మరీ 2019లో గెలిపించుకున్న పార్టీ

వైయస్సార్సీపీ. దాని ఆధ్వర్యంలోని ప్రభుత్వంపై ఏ వర్గం వారికైనా అసలు ఎందుకు కోపం ఉండాలి? ఎందుకు అసహనం, అసంతృప్తి ఉండాలి? లోపం వారిలో ఉందా? లేక జగన్ సారధ్యంలోని ప్రభుత్వ నిర్వహణలో ఉందా? వైసీపీ నేతలు ఈ ప్రశ్నలు ఎప్పుడైనా వేసుకున్నారా?

ముందు,ఈ ప్రశ్నలకు జవాబులను కనుక్కుంటే... 175/ 175 గురించి ముందుకు ఎలా వెళ్ళాలి అనే విషయంలో ముఖ్యమంత్రి జగన్‌కు ఓ స్పష్టత వస్తుంది.

ఒకవేళ ఏ వర్గం వారికైనా అసహనం, అసంతృప్తి, ఆగ్రహానికి తగిన కారణం ఉందని ప్రభుత్వం భావిస్తే, ఆ వర్గం కోప కారణాలను పరిగణనలోకి తీసుకుని దానిని ఎలా అడ్రస్ చేయాలనే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించాలి. ఈ విషయాలు తెలియక పోతే, తెలిసినవారిని అడగాలి. కేంద్ర ప్రభుత్వానికి గానీ, దేశంలో మిగిలిన 28 రాష్ట్ర ప్రభుత్వాలకు గానీ లేనంతమంది సలహాదారులు మన రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నారు కదా!

2019 ఎన్నికలకు ముందు ఏ ఒక్క వర్గమూ వైయస్సార్సీపీపై కోపంగా, అసహనంగా, ఆగ్రహంగా లేదు. ఇప్పుడు మాత్రం ఎందుకు ఉండాలి అనే విషయాన్ని ముఖ్యమంత్రి జగన్ పరిగణనలోకి ఎప్పుడైనా తీసుకున్నారో... లేదో తెలియదు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కోపంగా ఉన్నారని ఉద్యోగ సంఘాల నేతల ప్రకటనలే చెబుతున్నాయి. ఉపాధ్యాయ సంఘాలు కారాలు, మిరియాలు నూరుతున్నాయి. ఆర్‌టీసీ ఉద్యోగులు ఆగ్రహంగా ఉన్నారు. నిరుద్యోగుల సంగతి సరేసరి. ఇక, నగదు బదిలీలో లబ్ధిదారుల సంఖ్య క్రమంగా తగ్గిపోతుందని అంటున్నారు. ఇక విడో పింఛన్లలో కోత సరేసరి.. అలాగే, ఇసుక దొరకడం లేదని కొందరు అంటుంటే, ఈ చెత్త పన్ను ఏమిటి అని మరి కొందరు ప్రభుత్వంపై కక్షెర జేస్తున్నారు. ఇక, కరెంట్ బిల్లులు జనాలకు బీపీ, హార్ట్ ఎటాక్ తెప్పిస్తున్నాయని అంటున్నారు. గృహస్థులు ఆస్తి పన్ను చూసి బేంబేలెత్తుతున్నారు. అసలు ఇన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై అసహనంగా ఎందుకు ఉండవలసి వస్తుందనేదానిపై జగన్‌కు ఓ అవగాహన కలిగితే వారిని శాంతింప చేయడానికి ఏదో ఒక మార్గం కనిపించకపోదు. అప్పుడు ఎన్నికలకు సమాయత్తం కావచ్చు.

2019ని గుర్తుకు తెచ్చేలా... సమాజంలోని ఏ వర్గమూ ప్రభుత్వం పట్ల గుర్రుగా లేని వాతారణం కల్పించుకోగలిగితే... 175కి 175 అనేది పెద్ద విషయం కాదు. కానీ, 175కు 175 గెలవగలిగిన రాజకీయ, సామాజిక, ఆర్థిక, భౌతిక స్థితిగతులతో పాటు ఇందుకు అనువైన 'రాజకీయ వాతావరణం' సమాజంలో నెలకొని ఉన్నదా అనేది ముందుగా ఆయన మదింపు చేసుకోవడం ముఖ్యం.

అమరావతి బాధిత రైతులు రెండో మహా పాదయాత్ర ప్రారంభించారు. అమరావతి టు అరసవెల్లి మహా పాదయాత్రకు జనం నుంచి పెద్దఎత్తున సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. మరోపక్క 'గడప గడపకూ మన ప్రభుత్వం..' సమాచారం పెద్దగా ఎక్కడా కనపడడం లేదు. ప్రభుత్వంపై జనం ఆగ్రహంగా ఉన్నారనే ప్రచారమే ఇందుకు కారణం. ముఖ్యమంత్రి పర్యటనలు కూడా పోలీసుల భారీ బందోబస్తు మధ్య జరుగుతుండడం చూస్తున్నవారికి, ఇదో కొత్త అనుభవంగా కనపడుతోంది. ముఖ్యమంత్రి ప్రయాణ మార్గంలో జనాన్ని ఇళ్లకు పరిమితం చేయడం, రోడ్లకు అటూ ఇటూ గోతులు తవ్వి, జనం బయటకు రాకుండా చేయడం, ఇళ్ల ముందు బారికేడ్లు, తెరలు కట్టడం వంటివి గతంలో చూడలేదు. జగన్ సభలకు వచ్చే జనం కూడా మధ్యలోనే సభ నుంచి వెళ్లిపోతున్న ఫోటోలు, వ్యాఖ్యానాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయినప్పటికీ రాష్ట్ర శాసనసభలోని 175కి 175 రావాల్సిందేనని జగన్ భావిస్తున్నారేమో తెలియదు.

ఒక్క కుప్పం మినహా, మిగిలిన 174 ఖాయం అనే భావంతో జగన్ ఉన్నారా అన్నట్టుగా, ఆయన ఇటీవల కుప్పం వెళ్లారు. అక్కడనుంచి గత 30 ఏళ్లుగా చంద్రబాబునాయుడే శాసనసభ్యులుగా ఉన్నారు. ఈసారి అక్కడ కూడా గెలవడం ఖాయమనే ధీమాతో జగన్, కుప్పంపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

అయితే, అక్కడ టీడీపీ గెలవడం వల్ల చంద్రబాబుకు వచ్చే లాభం గానీ, ఓడిపోవడం వల్ల ఆయనకు వచ్చే నష్టం గానీ కనపడడం లేదు.

మిగిలిన 174లో వైసీపీ గెలిస్తే కుప్పంలో ఓడిపోవడాన్ని మించిన సుఖం చంద్రబాబుకు ఏమి ఉంటుంది?

ఒకవేళ శాసనసభలో మెజారిటీ సీట్లను వైసీపీ గెలుచుకోలేక పోతే కుప్పంలో ఓడిపోయినా చంద్రబాబుకు వచ్చిన నష్టం ఏముంటుంది? బెంగాల్‌లో మమతా బెనర్జీ నందిగ్రామ్ నియోజకవర్గంలో ఓడిపోయారు. ముఖ్యమంత్రి కావడానికి ఈ ఓటమి అడ్డంకి కాలేదు కదా!

'ఈ లెక్కలు... డొక్కలతో పని ఏమిటి... 175కు 175 గెలవడానికి ఓటర్లకు కావలసిన 'ఇంధన సరంజామా అంతా మన దగ్గర ఉన్నప్పుడు?' అనే భావం వైసీపీ ముఖ్యనేతలలో ఉంటే... ఇక క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ ఫరవాలేదు.

- భోగాది వేంకట రాయుడు

ఘనంగా బోయి భీమన్న, జాషువాల జయంతి

నెల్లూరులోని సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో ఈనెల 25న ప్రముఖ కవులు బోయి భీమన్న, గుర్రం జాషువాల జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక వర్ధమాన సమాజం సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో తొలుత భీమన్న, జాషువాల చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం కవితల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వేదిక జిల్లాశాఖ అధ్యక్షుడు శ్రీధర్, నారాయణ, లక్ష్మీనారాయణ, జయప్రద, రమాదేవి, శ్రీనివాస్, సత్యం, రామదండు, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి చెస్ పోటీలకు.. జాహ్నవి

విడవలూరు మండలం అలగాని పాడు గ్రామానికి చెందిన జాహ్నవి జాతీయస్థాయి చెస్ పోటీలకు ఎంపికైంది. కృష్ణాపురం నవోదయ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న జాహ్నవి ఇటీవల అనంతపురంలో జరిగిన జవహర్ నవోదయ విద్యాలయాల రీజనల్‌స్థాయి చెస్‌పోటీల్లో ప్రతిభ కనపరచడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, పీడీ సత్యదేవి తెలియజేశారు.

పండిట్ దీన్‌దయాళ్ జీవితం మార్గదర్శకం

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సిద్ధాంతాలు అందరికీ ఆదర్శమని, ఆయన జీవితం మార్గదర్శకమని పలువురు బిజెపి నాయకులు పేర్కొన్నారు. ఈనెల 25న దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్, రాష్ట్ర అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ దేశానికి చేసిన సేవలను వివరించారు. నాయకులు రాజేంద్ర ప్రసాద్, ఫణిరాజు, గిరికుమార్‌గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు. తొలుత దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జిల్లాలో.. గుట్టలు గుట్టలుగా గుట్కాలు

- కందుకూరు, గుడ్లూరు ప్రాంతాల్లో విక్రయాలు
- 46 లక్షల విలువచేసే సరుకు పట్టివేత

స్వాధీనం చేసుకున్న గుట్కాల బస్తాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ, సెబ్ జేడీ

ప్రజారోగ్యాన్ని మట్టుబెట్టే గుట్కాలు, ఖైనీలు, గంజాయి తదితర మత్తుపదార్థాలు, నిషేధిత వస్తుసామగ్రిపై జిల్లా ఉన్నతాధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇప్పటికే దొరికినవారిని దొరికినట్లుగా అరెస్టులు చేసి, వారి నుంచి గుట్టల కొద్దీ ఉన్న గుట్కాలను స్వాధీనం చేసుకుంటున్నారు. తాజాగా నెల్లూరు జిల్లా కందుకూరు, గుడ్లూరు తదితర ప్రాంతాల్లో గుట్కాల విక్రయాలు చేస్తున్న ఇద్దరిపై దాడులు చేసి వారి నుంచి సుమారు 46 లక్షల విలువచేసే గుట్కాలను పట్టుకున్నారు.

ఎంతోకాలం నుంచి బెంగుళూరు నుంచి గుట్కాలను తీసుకొచ్చి గుట్టుగా అమ్మేసుకుని అక్రమార్జన చేస్తున్న ఇద్దరు పాత నేరస్థులను జిల్లా పోలీసులు, సెబ్ అధికారులు పట్టుకున్నారు. వారి నుంచి భారీస్థాయిలో గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు, సెబ్ జేడీ శ్రీలక్ష్మి ఈ నెల 28న విలేకరుల సమావేశం పెట్టి, ఆ వివరాలు తెలియజేశారు. గుడ్లూరు మండలం తెట్టు గ్రామానికి చెందిన తిరుమలరాజు వెంకటేశ్వర్లు గోడౌన్‌పై దాడిచేసి 30 లక్షల విలువచేసే గుట్కాలను, కందుకూరుకు చెందిన బయ్యా సుధాకర్‌కు చెందిన గోడౌన్‌పై దాడి చేసి 16 లక్షల విలువచేసే గుట్కాలతో పాటు, మరో 400 ప్యాకెట్ల విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిద్దరిపై గతంలో కేసులు కూడా ఉన్నాయన్నారు. గుట్కాలు సరఫరా చేస్తున్నవారిపై కూడా కేసులు నమోదు చేస్తున్నామన్నారు. నిందితులను అరెస్ట్ చేసిన సెబ్ జేడీ టీమ్ ఇన్స్‌పెక్టర్ హుస్సేన్ బాషా, ఎస్ఐ బాలకృష్ణ తదితర పోలీసు సిబ్బందిని ఎస్పీ, జేడీ అభినందించారు.

ఇప్పటిదాకా 365 కేసులు

జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో గుట్కా, ఖైనీ, గంజాయి విక్రయాలపై నిఘాపెట్టి, వాటి నిల్వలపై దాడులు చేసి ఇప్పటి దాకా 365 కేసులు పెట్టామని, 450 మంది నిందితులను అరెస్ట్ చేశామని, వారి నుంచి దాదాపు 1.12 కోట్ల రూపాయల విలువైన గుట్కాలను స్వాధీనం చేసుకున్నామని సెబ్ జేడీ శ్రీలక్ష్మి ఈ సందర్భంగా వివరించారు. నిషేధిత పొగాకు ఉత్పత్తులను, అనధికార మద్యం విక్రయాలను, అక్రమ నిల్వలను, అసాంఘిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు.

ప్రజల సమస్యల్ని..

నెల రోజుల్లోగా పరిష్కరించాలి

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు.. సిఎం జగన్ ఆదేశం

'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి, ప్రజలు సూచించిన సమస్యలను ఒక నెల రోజుల లోపే పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈనెల 29 గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వం, ఈ-క్రాప్ పంట నమోదు, ప్రభుత్వ భవన నిర్మాణాల పురోగతి, జగనన్న ఇళ్ల నిర్మాణాలు, జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష, 'స్పందన' అర్జీలపై ముఖ్యమంత్రి మాట్లాడారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు సూచించిన సమస్యలను పరిష్కరించేందుకు ఒక్కొక్క సచివాలయానికి రూ. 20 లక్షలు మంజూరు చేశామని, సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించే 'స్పందన' కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో కలెక్టర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ-క్రాప్ పంట నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అదేవిధంగా సచివాలయాలు, రైతు భరోసా, డిజిటల్ లైబ్రరీ, వైయస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాల్లో పురోగతి సాధించేందుకు కలెక్టర్లు కృషి చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాల్లో దశలవారీగా పురోగతి సాధించేందుకు అవసరమైన అన్ని చర్యలు సకాలంలో చేపట్టాలని, అన్ని లేఅవుట్లలో స్వాగత ముఖ ద్వారాలు అందంగా ఏర్పాటుచేయాలని ఆదేశించారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు త్వరగా బ్యాంకు రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద రీ-సర్వేను వేగంగా చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 26న అమలు చేయనున్న రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, నవంబర్ 10న అమలు చేయనున్న వసతి దీవెన పథకాలకు సంబంధించి ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని, అర్హుల జాబితాను సకాలంలో సచివాలయాల్లో ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, ఎస్పీ విజయారావు, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, ఏఎస్పీలు హిమవతి, చౌడేశ్వరి, డిపిఓ ధనలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.



దేశ రాజకీయాలలో తిరుగులేనిది మీ ప్రస్థానం

జిల్లా ప్రజల హృదయాలలో చెరిగిపోనిది మీ స్థానం

'ఇంతింతై.. వటుడింతయై' అన్నట్లుగా అంచలంచెలుగా ఎదిగి,
దేశ రాజకీయాలలో విశేష గుర్తింపును పొందిన విశిష్టత మీది.
కన్నతల్లిని, జన్మభూమిని మరువకూడదని పదే పదే చెప్తూ,
నెల్లూరుజిల్లా అభివృద్ధి కోసం అహరహం తపించి శ్రమించిన ఖ్యాతి మీది.

మీ కలల రూపాలుగా జిల్లాలో ప్రకాశిస్తున్న...

- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం & ట్రావెల్స్ మేనేజ్‌మెంట్ కళాశాల
- దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి పునరావాస మరియు సాధికారత సమ్మిళిత ప్రాంతీయ కేంద్రం(CRC)
- ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం
- ఆల్ ఇండియా రేడియో ఎఫ్ఎం కేంద్రం

వీటితో పాటుగా మీరు కేంద్రమంత్రిగా ఉన్న సమయంలో
కేంద్ర ప్రభుత్వ అర్బన్ పథకం ద్వారా వెంకటాచలం మండలంలో చేసిన అభివృద్ధి,
మీ ప్రత్యేక చొరవతో సి.ఆర్.ఎఫ్ నిధుల ద్వారా రూ. 30 కోట్లతో గత టిడిపి
ప్రభుత్వంలో వెంకటాచలం మండలం చవటపాలెం పంచాయతీ పరిధిలోని
అప్పయ్య గేట్ నుండి మనుబోలు - పొదలకూరురోడ్డుకు వెళ్లే రహదారి నిర్మాణం.

ఇవన్నీ మచ్చుకి కొన్ని మాత్రమే. ఇలా చెప్పకుంటూ వెళ్తే...
మన జిల్లాకు మీరందించిన సేవలు, వరాలు అనేకం, అపారం, అపూర్వం!

మాకు అత్యంత ఆప్తులు, ఆత్మీయులు, నిత్యం మా శ్రేయస్సును కాంక్షించే
మా కుటుంబ శ్రేయోభిలాషి,
భారత 13వ ఉపరాష్ట్రపతిగా అయిదేళ్ళ కాలంలో
ప్రపంచ ప్రఖ్యాత గుర్తింపును సాధించి, తొలిసారిగా నెల్లూరుకు వస్తున్న
ప్రగతిరథ సారధి, మన జిల్లా అభివృద్ధికి వారధి

శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు గారికి
ఆత్మీయ అభినందన స్వాగతాంజలి.

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
మాజీ మంత్రివర్యులు, పొలిట్‌బ్యూరో సభ్యులు - తెలుగుదేశం పార్టీ

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com